జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన


NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
న్యూస్ ఈజ్ రైట్
6-2-29/3/12, 3వ అంతస్తు,
దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004
వివరాలకు సంప్రదించండి : 8886022523

సంపుటి 12 సంచిక 109 విశాఖపట్నం ఆదివారం 3 జనవరి 2021 8 పేజీలు వెల : 5.00

## అది మనందరి బాధ్యత: మోదీ



**సబల్‌పూర్, డిసెంబర్ 2 (ప్రజా పాలన) :** లోకల్ టాలెంట్‌ను గ్లోబల్ టాలెంట్‌గా మార్చేందుకు విద్యార్థులు కొత్త ఆలోచనలతో ముందుకు రావాలని ప్రధాని నరేం ద్ర మోదీ అన్నారు. శనివారం ఒడి శాలోని సబల్‌పూర్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం)శాశ్వత ప్రాంగణానికి పునాది రాయి వేసిన క్రమంలో ఆయన మాట్లాడారు. 'లోకల్‌ను గ్లోబల్‌గా మార్చేందుకు ఐఐఎం విద్యార్థులు కొత్త ఆలోచనలతో ముందుకు రావాలి. దేశంలో 20 ఐఐఎంలు ఉన్నాయి. ఇక్కడి టాలెంట్ అంతా స్వావలంబన భారత్ పురోగతికి దోహదపడుతుం ది' అని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే సమ్మిళిత అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. అట్టడుగు వర్గాలకు చెందిన ప్రజలు అభివృద్ధిలో భాగమయ్యేలా ఆలో చనలు చేయాలన్నారు. 'ఈ దశాబ్దంలో భారతదేశంలో బహుళ జాతి సంస్థ(ఎంఎన్‌సీ)ల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి పెడదాం. నేడు స్టార్టప్‌లుగా పురుడుపోసుకున్న సంస్థలే భవిష్యత్తులో ఎంఎన్‌సీలుగా మిగతా 2లో..

## బహుజనుల కోసమే మాస్టర్ కీ (అంబేద్కర్ టీవి) ఛానెల్

### మాస్టర్ కీ టీవీ ఛానెల్ ఛైర్మన్ శివ భాగ్యరావు




**పొన్నూరు, ప్రజాపాలన :** బహుజనులు గొంతుకను ఎలుగెత్తి చాటేందుకే అంబేద్కర్ టీవి ప్రారంభించడం జరిగిందని అంబేద్కర్ టీవీ ఛైర్మన్ భాగ్యరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో శనివారం జరిగిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. బహుజనుల భాగస్వామ్యం తో అంబెద్కర్ టీవీ నడుస్తోందని చెప్పారు. అన్ని నియోజకవర్గాల్లో ఒక ఓనర్ ఉంటారని చెప్పారు. ఇప్పటికే స్నేహ టీవీ సేవలు అందిస్తోంది తెలిపారు. పూర్తి స్థాయిలో ఇంకా గొప్పగా బహుజనులు గొంతుక వినిపించాలనే ఉద్దేశ్యంతో ప్రజా సహకారంతో అంబేద్కర్ టీవీ విస్తృతంగా అన్ని మాధ్యమాల్లో మిగతా 2లో..

## చైర్మన్ పదవి నుంచి అశోక్ గజపతిరాజు తొలగింపు



**విజయవాడ, జనవరి 2 (ప్రజా పాలన) :** రామతీర్థం దేవస్థానం ఛైర్మన్ పదవి నుంచి అశోక్ గజపతిరాజును తొలగిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆలయ నిర్వహణలో వైఫల్యం చెందిన నేపథ్యంలో పదవి నుంచి తొలగిస్తూ దేవాదాయ శాఖ కార్యదర్శి గిరిజాశంకర్ మెమో జారీ చేశారు. రామతీర్థం సహా 3 ఆలయాల ఛైర్మన్ల పదవి నుంచి ఉద్వాసన పలికింది. పైడితల్లి, తూర్పుగోదావరి జిల్లా మందపల్లి దేవస్థానాల ఛైర్మన్ పదవుల నుంచి తప్పిస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. కాగా, రామతీర్థం బోడి కొండపై ఉన్న కోదండ రామా లయంలో డిసెంబర్ 28వ తేదీ అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు శ్రీరాముని విగ్రహం శిరస్సు తొలగించి, సీతమ్మవారి కొలనులో పడేసిన సంగతి తెలిసిందే..

# రామతీర్థం రణరంగం

**విజయనగరం, జనవరి 2 (ప్రజాపాలన) :** ఒకే రోజు తెదేపా, భాజపా, వైకాపా నేతల పర్యటనతో విజయనగరం జిల్లా రామతీర్థం రణరంగంలా మారింది. తెదేపా అధినేత చంద్రబాబు రామతీర్థం పర్యటన ముందే ఖరారు కాగా... వైకాపా ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జి, ఎంపీ విజయసాయిరెడ్డి కూడా రామతీర్థం ఆలయాన్ని సందర్శించారు. వీరితో పాటు భాజపా ఎమ్మెల్సీ మాధవ్ కూడా అక్కడికి చేరుకోవడంతో మూడు పార్టీల కార్యకర్తల పోటా పోటీ ఆందోళనలు, నిరసనలతో రామతీర్థం అట్టుడికింది. పోలీసులు భారీగా మోహరించినా ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న ఉద్రిక్తత ఏర్పడింది. చంద్రబాబు కంటే ముందే విజయసాయిరెడ్డి రామతీర్థం అలయాన్ని సందర్శించారు.



పోలీసుల తీరుపై భాజపా నిరసన కొండపైకి వెళ్లేందుకు ఎవరికీ అనుమతిలేదని చెప్పిన పోలీసులు విజయసాయిరెడ్డిని అనుమతించడంతో భాజపా శ్రేణులు భగ్గుమన్నాయి. తమను కూడా బోడికొండపైకి అనుమతించాల్సిందేనని ఎమ్మెల్సీ మాధవ్ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఒకవైపు భాజపా నేతల ఆందోళన కొనసాగుతుండగానే విజయసాయిరెడ్డితో పాటు భారీగా వైకాపా నాయకులు కొండపైకి నడుచుకుంటూ వెళ్లి కోదండరాముడి ఆలయాన్ని సందర్శించారు. అనంతరం కొండదిగి కిందకు వస్తున్న క్రమంలో విజయసాయిరెడ్డి వాహనంపై గుర్తు తెలియని వ్యక్తి రాయి విసరడంతో ఒక్కసారిగా ఉద్రిక్తత ఏర్పడింది. వైకాపా, తెదేపా, భాజపా శ్రేణులు పోటా పోటీగా నినాదాలు చేయడంతో రామతీర్థం రణరంగంగా మారింది. మూడు పార్టీల కార్యకర్తలు తోపులాటకు దిగారు. భాజపా శిబిరం వద్ద జరిగిన తోపులాటలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి పావని సొమ్మసిల్లి పడిపోయారు. విగ్రహాల ధ్వంసాన్ని అడ్డుకోలేక పోయిన నేతలు పర్యటనకు ఎందుకొచ్చారని విపక్షాలతో పాటు హిందూ సంఘాలు భగ్గుమన్నాయి. భారీ పోలీసు బందోబస్తు మధ్య విజయసాయిరెడ్డి పర్యటన సాగింది. బోడికొండ దిగువున వైకాపా, తెదేపా, భాజపా శ్రేణులు ప్రత్యేకంగా శిబిరాలు ఏర్పాటు చేసుకొని ఆందోళనకు దిగారు. మరో వైపు విశాఖ నుంచి రోడ్డు మార్గంలో రామతీర్థం బయల్దేరిన చంద్రబాబు కాన్వాయ్‌కు మిగతా 2లో..

### ఆ ఆరోపణలు నిరూపించలేకపోతే

## రాజకీయాలు వదిలేస్తా: స్టాలిన్



**కోయింబత్తూర్, జనవరి 2 (ప్రజాపాలన) :** తమిళనాడు పురపాలక మంత్రి ఎస్పీ వేలుమణిపై తాను చేసిన అవినీతి ఆరోపణలను నిరూపించలేకపోతే రాజకీయాలు వదిలేస్తానని డీఎంకే చీఫ్ ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. తనపై చేసిన అవినీతి ఆరోపణలు నిరూపించాలనీ.. లేకుంటే రాజకీయ సన్యాసం తీసుకోవాలంటూ వేలుమణి సవాల్ విసిరిన నేపథ్యంలో స్టాలిన్ ఈ మేరకు స్పందించారు. "రాజకీయాలు వదిలేసేందుకు నేను సిద్ధం.. మీరు సిద్ధమా?" అని స్టాలిన్ ఛాలెంజ్ చేశారు. మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న తొండముత్తూర్ నియోజకవర్గంలోని మిగతా 2లో..

## అందుకే శ్రీరాముడి విగ్రహాలు ధ్వంసం చేస్తున్నారు

### పవన్ కళ్యాణ్ ఫైర్



**అమరావతి, జనవరి 2 (ప్రజా పాలన) :** ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా రామతీర్థంలో శ్రీరాముడి విగ్రహ ధ్వంసం ఘటనపై పవన్ కళ్యాణ్ ఘాటుగా స్పందించారు. రాష్ట్రంలో ధర్మ విచ్ఛిన్నానికే శ్రీరాముడి విగ్రహాలను ధ్వంసం చేస్తున్నారని ఆరోపించారు. రాక్షస వారసులెవరో వర్తమానంలో ధర్మ విచ్ఛిన్నానికి పాల్పడుతున్నారని మండిపడ్డారు. పాకిస్తాన్‌లో ఆలయాలను ధ్వంసం చేసిన నిందితులను అరెస్ట్ చేశారని, ఏపీలో జగన్ రెడ్డి ప్రభుత్వం నిందితులను కనీసం పట్టుకోలేకపోయిందని విమర్శించారు. 'ధర్మానికి నిండైన రూపంగా దర్శనమిచ్చే శ్రీరామచంద్రుడి విగ్రహాలను ధ్వంసం చేయడం ద్వారా రాష్ట్రంలో హిందూ విశ్వాసాలకు విఘాతం కలిగించే కుట్ర సాగుతోంది. తాజాగా కర్నూలు జిల్లా మర్లబండలో ఆంజనేయ స్వామి ఆలయ గోపురంపై ఉన్న సీతారామచంద్రుల విగ్రహాలను పగులగొట్టడం దుర్మార్గమైన చర్య. ఈ వరుస ఘటనలను ప్రతి ఒక్కరం ఖండించాలి. గత ఏడాదిన్నర కాలంలో రాష్ట్రంలో హిందూ ఆలయాలకు, విగ్రహాలకు అప్రతిష్ట జరుగుతున్నా ప్రభుత్వం కిమ్మనకుండా ఉండడం వల్లే మతోన్మాదులు మరింతగా తెగబడుతున్నారు.' అని పవన్ కళ్యాణ్ ఫైర్ అయ్యారు. పొరుగున ఉన్న శత్రుదేశంలో

## కరోనా తగ్గుముఖం: కొత్తగా 238 కేసులు




**అమరావతి, జనవరి 2 (ప్రజాపాలన) :** ఆంధ్రప్రదేశ్‌లో కరోనా వైరస్ కేసులు భారీగా తగ్గుముఖం పడుతున్నాయి. గత 24 గంటల్లో రాష్ట్రంలో 48,518 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా.. 238 మందికి కోవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. కోవిడ్ వల్ల నిన్న ఒక్క రోజు పశ్చిమ గోదావరి జిల్లాలో ఇద్దరు, చిత్తూరులో ఒకరు మరణించారు. దీంతో ఇప్పటి వరకు కరోనా సోకిన వారి సంఖ్య 8,82,850కు మిగతా 2లో..

## ఆలయ అధికారులపై చంద్రబాబు తీవ్ర ఆగ్రహం



**అమరావతి, జనవరి 2 (ప్రజాపాలన) :** విజయనగరం జిల్లా రామతీర్థం ఆలయాన్ని సందర్శించిన టీడీపీ అధినేత చంద్రబాబు అక్కడి ఆలయ అధికారులపై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ధ్వంసమైన రాముడి విగ్రహాన్ని చూసేందుకు చంద్రబాబు అక్కడకు వెళ్లిన సంగతి తెలిసిందే. ఆయన కొండపైకి వెళ్లక ముందే వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి పైకి వెళ్లొచ్చారు. విజయసాయి ఆలయం వద్దకు వెళ్లినప్పుడు ఆలయ అధికారులు ఆయనను గర్భగుడిలోకి తీసుకెళ్లారు. ఆలయంలో ఆయన పూజలు కూడా నిర్వహించారు. అయితే, చంద్రబాబు వెళ్లినప్పుడు మాత్రం అధికారులు ఆలయానికి తాళం వేశారు. తాళం ఎందుకు వేశారని ప్రశ్నిస్తే... విచారణ జరుగుతోందని సమాధానమిచ్చారు. దీంతో, చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం విగ్రహాలను ఆయన వెలుపలి నుంచే పరిశీలించారు. రాముడి విగ్రహం మిగతా 2లో..

మాస్టర్ కీ TV
(అంబేడ్కర్ TV)
TV MASTER KEY NEWS FOR EQUALITY

జై భీం,
మీరు నాయకుడిగా ఎదగాలని అనుకుంటున్నారా...?
మీరనుకున్న వార్తలు రావాలని కోరుకుంటున్నారా...?
పెట్టుబడి లేకుండా ఆదాయం పొందాలని అనుకుంటున్నారా...?
మీరూ మీ అసెంబ్లీ నియోజకవర్గం లో
టీవీ ఛానల్ ఓనర్ గా కావాలని అనుకుంటున్నారా...?
అయితే రండి, కదలి రండీ

బహుజనాభివృద్దే.. దేశాభివృద్ధి అని నిరూపిద్దాం

1. ఈ దేశంలో ఉన్న ఫోర్త్ ఎస్టేట్ (మీడియా రంగం) బహుజనుల సమస్యల మీద ప్రచారం చేయడం లేదని మీ అందరికీ తెలుసు. దేశంలోనే మొట్ట మొదటిసారిగా విలేఖరులకు సామాజిక కార్యకర్తలకు, అంబేడ్కర్, పూలే సంఘం నాయకులకు, కనీసం 100 మంది తెలిసిన గ్రూపునాయకులకు టీవీ ఛానల్ ప్రతినిధిగా / యజమానిగా అవకాశం ఇవ్వబడును.
2. జీవిత కాలంలో ఆయా అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రతినిధిగా / యజమానిగా నియమించబడును.
3. ఆయా ప్రతినిధికి ప్రకటనల ఆదాయం (Advertising Revenue)లో ప్రకటనలపై 40% ఆదాయం ఇవ్వబడును.
4. వార్తలను స్వేచ్ఛాయతంగా ప్రసారం (Telecast) చేసే వీలు కల్పించబడును.

సంప్రదించండి

Tel No: 9849031420 ,9440918143, 94409 18371, 94400 53858, 93473 50692,8008840506, 9440077239, 7798832998, 76600 27678,
Office: Ambedkar TV Channel, 3rd Floor, Dault Plaza, Main Road, Besides Bata Showroom, Lakdi ka pool, Hyderabad - 500004
E- mail : ambedkartvchannel2018@gmail.com www.ambedkartv.org

## అది మనందరి బాధ్యత: మోదీ

(మొదటిపేజీ తరువాయి)

మారతాయి. ఈ విద్యాసంస్థల నుంచి బయటకు వెళ్లేవారు వాటికి నాయకత్వం వహించాలి. అలాగే బ్రాండ్ ఇండియాకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడం మన బాధ్యత' అని మోదీ అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానితో పాటు ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, కేంద్ర మంత్రి రమేశ్ పొఖ్రియాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ అధికారులపై చందబ్రాబు తీవ్ర ఆగ్రహాం

(మొదటిపేజీ తరువాయి)

తలను దుండగులు విసిరేసిన కోనేరును కూడా పరిశీలించారు. చంద్రబాబుకు ఆలయంలోకి అనుమతి ఇవ్వక పోవడంపై టీడీపీ శ్రేణులు మండిపడుతున్నాయి. కేవలం రాజ్యసభ సభ్యుడైన విజయసాయిరెడ్డికి ఏ హోదాతో అనుమతి ఇచ్చారని ప్రశ్నిస్తున్నాయి. ఆలయ అధికారులు, పోలీసులపై అసహనం వ్యక్తం చేస్తున్నాయి.

## ఆ ఆరోపణలు నిరూపించలేకపోతే రాజకీయాలు వదిలేస్తా: స్టాలిన్

(మొదటిపేజీ తరువాయి)

దేవరాయపురంలో ఇవాళ స్టాలిన్ ఈ వ్యాఖ్యలు చేశారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి, ఆయన కేబినెట్‌లోని మంత్రులపై అవినీతికి పాల్పడుతున్నారంటూ డీఎంకే గత నెలలో గవర్నర్‌కు మెమొరాండం ఇచ్చిన విషయం తెలిసిందే. దీనిపై వేలుమణి స్పందిస్తూ.. డీఎంకే చేసిన ఆరోపణలు నిజమని నిరూపిస్తే తాను పదవి నుంచి తప్పుకునేందుకు సిద్ధమన్నారు. నిరూపించలేని పక్షంలో స్టాలిన్ రాజకీయాల నుంచి తప్పుకుంటారో లేదో చెప్పాలని సవాల్ విసిరారు.

## అందుకే శ్రీరాముడి విగ్రహాలు ధ్వంసం చేస్తున్నారు

(మొదటిపేజీ తరువాయి)

హిందూ దేవాలయాన్ని ధ్వంసం చేస్తే అక్కడి ప్రభుత్వం 45 మంది నిందితులను అదుపులోకి తీసుకోవడమే కాకుండా ఆ ఆలయాన్ని పునర్నిర్మించే బాధ్యత తీసుకుందని పవన్ కళ్యాణ్ చెప్పారు. శత్రుదేశం తీసుకున్న లాంటి చర్యలు కూడా కనీసం జగన్ ప్రభుత్వం తీసుకోలేదా? అని పవన్ కళ్యాణ్ ప్రశ్నించారు. శక్తిపీఠం ఉన్న పిఠాపురంలో విగ్రహాల ధ్వంసం ఘటన నుంచి తాజాగా రామతీర్థం, రాజమహేంద్రవరం వరకూ ఇప్పుడు మర్లబండ వరకు విగ్రహాలను పగులగొడుతున్నా, రథాలను తగులబెడుతున్నా ప్రభుత్వ స్పందన ఉదాసీనంగానే ఉందని పవన్ విమర్శించారు.దేవుడిపై భారం వేసేసి ఆలయాలను కాపాడే బాధ్యత నుంచి తప్పించుకోవాలని ప్రభుత్వం చూస్తుందని పవన్ కళ్యాణ్ నిన్న ఓ ప్రకటనలో విమర్శించారు. అంతర్వేది ఘటనపై నిరసన తెలిపినవారి పైనా... అక్కడ ఓ ప్రార్థన మందిరానికి నష్టం జరిగితే ఆగమేఘాలపై కేసులు పెట్టిన ప్రభుత్వం – హిందూ ఆలయాలు, దేవత విగ్రహాలను ధ్వంసం చేస్తే ఎందుకు దేవుడిపై భారం వేస్తుందని ప్రశ్నించారు. 'విజయవాడ అమ్మవారి ఆలయ రథంలో వెండి విగ్రహాల అపహరణ కేసు ఏమైందో ఎవరికీ తెలియదు. పిఠాపురం, కొండబిట్రగుంట కేసులు ఎటుపోయాయో ప్రజలకు అర్థం కావడం లేదు. వరుస ఘటనలు చూస్తుంటే రాష్ట్రంలో దేవాదాయ శాఖ అనేది ఒకటి ఉందా అనిపిస్తుంది. హిందూ దేవాలయాలపై సాగుతున్న దాడులను ఏ మత విశ్వాసాన్ని ఆచరించేవారైనా నిరసించాలి. అన్ని మతాల పెద్దలు ఒక వేదికపైకి వచ్చి విగ్రహ ధ్వంసాలు, రథాల దగ్ధాలను ఖండించాలి. అప్పుడే మత సామరస్యం, లౌకిక వాదం పరిఢవిల్లుతాయి.' అని పవన్ కళ్యాణ్ ఆకాంక్షించారు.

## కరోనా తగ్గుముఖం: కొత్తగా 238 కేసులు

(మొదటిపేజీ తరువాయి)


చేరింది. మొత్తం 7111 మంది మృత్యువాత పడ్డారు. ఈ మేరకు వైద్యారోగ్యశాఖ శనివారం హెల్త్ బులెటిన్ విడుదల చేసింది. గత 24 గంటల్లో కరోనా నుంచి 279 మంది డిశ్చార్జ్ కాగా.. ఇప్పటివరకు మొత్తంగా 8,72,545 మంది కోలుకున్నారు. ఏపీలో ప్రస్తుతం 3,194 యాక్టివ్ కేసులు ఉన్నాయి. ఇక ఇప్పటివరకు రాష్ట్రంలో1,19,32,603 శాంపిల్స్‌ను పరీక్షించారు.

## ఇదంతా టీడీపీ కుట్రలో భాగమే: బొత్స



**విజయవాడ, జనవరి 2 (ప్రజాపాలన) :** రామతీర్థం ఘటన ప్రతిపక్షాల కుట్ర అని మంత్రి బొత్స సత్యనారాయణ ఆరోపించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు ముందు రోజే టీడీపీ ఈ కుట్ర చేసిందని, పోలీసుల దర్యాప్తులో అన్ని విషయాలు బయటకు వస్తాయని పేర్కొన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించబోమని, బాధ్యులు ఎంతటి వారైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రామతీర్థ ఆలయాన్ని తామే అభివృద్ధి చేశామన్న మంత్రి బొత్స.. ఈ ఘటన జరిగిన వెంటనే విచారణకు ఆదేశించామన్నారు. "విషయం తెలిసిన వెంటనే మా ఎంపీ, ఎమ్మెల్యే రామతీర్థం వెళ్లారు. మరి టీడీపీ మాజీ ఎమ్మెల్యేలు రామతీర్థం ఎందుకు వెళ్లలేదు? చంద్రబాబు చిల్లర రాజకీయాల కోసం రామతీర్థం వెళ్తున్నారు. సీఎం పర్యటనకు ముందు రోజు ఉద్దేశపూర్వకంగానే టీడీపీ కుట్ర చేసింది. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల నుంచి దృష్టి మరల్చేందుకే చేయడానికే చంద్రబాబు కుట్రలు రచించారు. ఈ ఘటనలో దోషులు ఎంతటి వారైనా శిక్షిస్తాం. రామతీర్థంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం" అని మంత్రి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు.

### కఠిన చర్యలు తప్పవు: దేవాదాయ శాఖ మంత్రి వెల్లంపల్లి



చంద్రబాబు హడావుడిగా రామతీర్థానికి ఎందుకు వెళ్లారని దేవాదాయ శాఖా మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ ప్రశ్నించారు. "బాబు హయాంలో దేవాలయాలపై దాడులు జరిగినా పట్టించుకోలేదు. ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని రామతీర్థం వెళ్లారు. అక్కడి రాముడి ఆలయాన్ని చంద్రబాబు ఏనాడూ పట్టించుకోలేదు.






# బహుజనుల కోసమే మాస్టర్ కీ (అంబేద్కర్ టీవి) ఛానెల్




మాస్టర్ కీ టీవీ ఛానెల్ ఛైర్మన్ శివ భాగ్యరావు



(మొదటిపేజీ తరువాయి)

ప్రసారం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని పేర్కొన్నారు. బహుజనుల సమస్యల పరిష్కారం కోసం గొంతెత్తి చాటేందుకు అంబేద్కర్ టివి పని చేస్తోందని చెప్పారు. తొలుత ఏర్పాటు చేసిన అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో పొన్నూరు ఎంఇఓ అర్. శోభాచంద్ పొన్నూరు అంబేద్కర్ టీవీ ఓనర్ ఏ .రమాదేవి, శ్రీనివాసరావు, వర ప్రసాద్, భూపతి రావు, చల్లాపల్లి సురేష్ ,పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ గీతాలాపన జరిగింది. అనంతరం నూతన సంవత్సర కేక్‌ను చైర్మన్ భాగ్య రావు కట్ చేశారు. ప్రతిభ కనబరచిన వారికి ఘనంగా సన్మానించారు.

# రామతీర్థం రణరంగం

(మొదటిపేజీ తరువాయి)

పోలీసులు అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్నారని తెదేపా నేతలు మండిపడుతున్నారు. విజయసాయిరెడ్డి రామతీర్థంలో ఉండగానే చంద్రబాబు కాన్వాయ్ కూడా అక్కడికి చేరుకుంది. దీంతో చంద్రబాబు కాన్వాయ్ మరో మార్గంలో వెళ్లాలని పోలీసులు సూచించారు. చంద్రబాబు రామతీర్థం చేరుకోగానే తెదేపా శ్రేణులు జై శ్రీరామ్, జై తెలుగుదేశం అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

**చర్చకు నేను సిద్ధం: ఎంపీ విజయసాయి**

రామతీర్థం బోడికొండపై జరిగిన ఘటన చాలా శోచనీయమని ఎంపీ విజయసాయి రెడ్డి అన్నారు. జగన్ ప్రభుత్వాన్ని తప్పుపట్టేలా తెదేపా అధినేత చంద్రబాబు వ్యవహరిస్తున్నారని విజయసాయి మండిపడ్డారు. ఎక్కడికైనా వస్తా చర్చకు రమ్మని లోకేశ్ సవాల్ విసిరారని.. లోకేశ్ రమ్మన్నట్లు అప్పన్న సన్నిధికి వస్తానని.. చర్చకు సిద్ధంగా ఉన్నట్లు విజయసాయి వెల్లడించారు. నెల్లిమర్లలో ఇళ్ల పట్టాల పంపిణీని అడ్డుకోవాలని చంద్రబాబు కుట్ర పన్నారని ఆరోపించారు.

# పండగ వాతావరణం లో పల్లపట్ల శివారు పంచాయతీల్లో ఇళ్ల స్థలాలపట్టాల పంపిణీ




రాజ్యసభ సభ్యులు, ఎంపీ, మోపిదేవి వెంకట రమణారావు

**నిజాంపట్నం, జనవరి 2 (ప్రజాపాలన) :** నిజాంపట్నం మండలం పల్లపట్ల, కూచినపూడి, బొర్రా వారి పాలెం, గరువు పాలెం, ప్రజ్ఞం, కల్లి ఘలం గ్రామపంచా యతీలలో ముందుగానే వచ్చే సంక్రాతి పండుగ వాతావరణం లో తహసీల్దార్ జి. శ్రీనివాస్ అధ్యక్షతన ఇంటి స్థల పట్టాల పంపిణి కార్యక్రమం లబ్ధిదారులు కుటుంబ సభ్యులు తో తమకు కేటాయించిన స్థలాలను చూసుకొని పిల్ల పాపలతో ఆనంద సంబర మాశ్చర్యాలతో గ్రామాలు రంగవల్లులతో వెల్లివిరిసినాయి. బడుగు జీవుల కళ్ల లోనించి ఆనంద భాష్యాలు పొంగు కొచ్చాయి. నిలువ నీడ లేనివారికి, ఎన్నో ఏళ్లుగా అద్దె ఇంట్లో నివాసం ఉంటున్న అభాగ్య జీవులకు ఆనందం తొక్కిసలాడింది. ఇళ్ల పట్టాల పంపిణి, భూమి శంకుస్థాపన కు ముఖ్యఅతిధి గా విచ్చేసిన రాజ్యసభ సభ్యులు, ఎంపీ, మోపిదేవి వెంకట రమణారావుకి ప్రజలు బ్రహ్మ రథం పట్టారు.ప్రియతమ ముఖ్యమంత్రి వర్యులు వై యస్ జగన్ మోహన్ రెడ్డి 3648 కి.మీ ల పాదయాత్ర పేదవాడి సొంతింటి కల నెరవేర్చుందుకు రెవిన్యూ గ్రామానికి ఒక జగనన్న కాలనీ చొప్పున 17 వేలు ఏకంగా కొత్త గానే ఊళ్ళు రాబోతున్నాయని,ప్రతి గ్రామ పంచాయతీ లో జగనన్న కాలనీ లు ఏర్పాటు అవుతున్నాయని,వాటిలో వైయస్ ఆర్ జనతా బజార్, వైయస్ ఆర్ క్లినిక్, బస్టాప్, అంగన్వాడీ సెంటర్ లు ఉంటాయని,ప్రతి లే అవుట్ కు రోడ్డు, డ్రైనేజీ, విద్యుత్, మంచి నీటి సదుపాయాలు ఉంటాయని పొరపాటున ఇల్లు రాలేదని ఎవరైనా పేదవాడు సచివాలయం లో దరఖాస్తు చేస్తే గ్రామ వాలంటీర్ ద్వారా వారింటికే నేరుగా నిజమైన లబ్ధిదారునికి 90 రోజులలో ఇంటినివేశన స్థలం నిరంతర ప్రక్రియని ముఖ్యమంత్రి అవకాశం కల్పించారని, లబ్ధిదారులు ఎంపిక లో కులమతం, పార్టీ లకు తావు లేకుండా అర్హతే ప్రామాణికం గా ఒక్క రూపాయి ఖర్చు లేకుండా పేదవాడి సొంతింటి కల నెరవేరుతుంది.నాడు మహా నేత కాలనీలు కట్టిస్తే, నేడు జననేత ఊర్లను నిర్మించడం రాష్ట్ర చరిత్ర లోనే ఒక సువర్ణాధ్యాయం గా నిలిచి పోతుందన్నారు. గతం లో ఇళ్ల నిర్మాణానికి ఏ ప్రభుత్వం ఇన్ని నిధులు కేటాయించలేదని, నేటి ప్రభుత్వం 24 వేల కోట్లు రూపాయలు ఇళ్ల స్థలాల భూమి సేకరణ కు ఖర్చు చేయగా,60 వేల కోట్లు రూపాయలతో ఇంటి నిర్మాణానికి, కాలనీ ల అభివృద్ధి కి మొత్తం 90 వేల కోట్ల రూపాయలు 'పేదవాడి సొంతింటి కల' పథకానికి ప్రభుత్వం ఖర్చు పెడుతుందని, గత ప్రభుత్వానికి, నేటి పేదల సంక్షేమ ప్రభుత్వం ప్రతిష్టాత్మకం గా ప్రవేశపెట్టిన ఈ ఒక్క పథకం చాలు,తేడా గమనించడానికి అని ప్రత్యేకంగా తెలియజేశారు.తండ్రి గారు ఆరోగ్యశ్రీ పథకం తో తమ కీర్తి ని దశ దిశలతో ప్రపంచ వ్యాప్తంగా చాటితే తనయుడు తమ కీర్తి ప్రతిష్ట లను పేదవాడి సొంతింటి కల ద్వారా నవ రత్నాలు లో భాగమైన ఇంటినివేశన స్థలాల పంపిణీ ఎవరూ చేయలేని సాహసం చేసి రెట్టింపు కీర్తి ప్రతిష్ట లను ప్రపంచవ్యాప్తంగా మన ముఖ్య మంత్రి పొంది, పరిపాలనాదక్షుడుగా, 18 మాసాల లోనే ఇన్ని పథకాలు ప్రవేశపెట్టి, ఆచరించి, అభివృద్ధి పరచిన మేటి ముఖ్యమంత్రి గా పేరు ప్రఖ్యాత లు సంపాదించారని, పేదల పక్షపాతి మన జగన్ మోహనరెడ్డి అని తెలియజేశారు. నిజాంపట్నం మండలం లో మొత్తం 3291 లబ్ధిదారులు కాగా, ఈరోజు పంపిణీ జరుగుతున్న పల్లపట్ల 74 మంది, కూచినపూడి 154 మంది, బొర్రా వారి పాలెం 93 మంది, గరువు పాలెం 71, ప్రజ్ఞం 60, కల్లిఫలం 85 మంది లబ్ధిదారులకు ఇంటి నివేశన పట్టాలు పంపిణీ చేశారు.సభా సమావేశాలు, ఏర్పాట్లు ను వై యస్ ఆర్ సీపీ నాయకులు, రాజ్యసభ సభ్యులు, ఎంపీ, సోదరులు మోపిదేవి వెంకట హరనాథ్ బాబు, నర్రా సుబ్బయ్య సారధ్యం లో పల్లపట్ల గ్రామంలో అంగిరేకుల కృష్ణమూర్తి, పట్టపు రత్తయ్య,పంద్రబోయిన బసవపున్నారావు,కూచినపూడి గ్రామం లో నల్లపాటి రామయ్య, పిచ్చయ్య, కొలసాని వీరభద్రరావు, గరువు పాలెం గ్రామం లో కొలసాని కోటేశ్వరరావు, కొలసాని శ్రీహరి, గాదె సుబ్రహ్మణ్యశ్వర రావు, ప్రజ్ఞం గ్రామం తుంగల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పూల మాలలు, రంగవల్లులతో ఏర్పాట్లు ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ జి. శ్రీనివాస్ , ఎంపీడీఓ నర్రా నాగలక్ష్మి పర్యవేక్షణ ఏర్పాట్లు ను, అభివృద్ధి శంకుస్థాపన, శిలాఫలకాలను ఆవిష్కరణ లో పాల్గొన్నారు.కార్యక్రమం లో డిప్యూటీ తహసీల్దార్ సయ్యద్ ఇక్బాల్, ఈ ఓ పి ఆర్ %డ% ఆర్ డి ఉషారాణి, పంచాయతీ రాజ్ ఏ ఈ చక్రవర్తి, ఆర్ ఐ సతీష్, వి ఆర్ ఓ లు జ్యోతి, సర్దార్, సుభాని, కోటేశ్వరరావు, శామ్యూల్, మాధవి, ప్రకాష్, పంచాయతీ కార్యదర్శులు ఏ. ప్రసాదరావు,గోపాలరావు,గ్రామ వాలంటీర్ లు, వై యస్ ఆర్ సీపీ ప్రముఖులు చందోలు దేవదాస్, ప్రసాదం వాసుదేవ, యార్లగడ్డ మదన్,బండారు రామారావు, వీరంకి ముక్తేశ్వరరావు,నాజర్ ఖాన్, మిరియాల యేసు, ప్రభాకరరావు,వై యస్ ఆర్ సీపీ కార్యకర్తలు, అభిమానులు,డ్వాక్రా మహిళా సంఘాలు,గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే సహించం: ఎస్పీ

**విజయనగరం, జనవరి 2 (ప్రజా పాలన) :** రామతీర్థం ఘటనపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే సహించమని ఎస్పీ రాజకుమారి హెచ్చరించారు. విచారణలో పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కాగా రామతీర్థం బోడికొండపై ఉన్న కోదండ రామాలయంలో ఈ నెల 28వ తేదీ అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు శ్రీరాముని విగ్రహం శిరస్సు తొలగించిన విషయం విదితమే. ఈ దుశ్చర్యపై తీవ్రంగా స్పందించిన ప్రభుత్వం.. డీఐజీ రంగారావు, ఎస్పీ రాజకుమారి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఐదు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించింది. దేవదాయశాఖ ఆర్‌జేసీ భ్రమరాంబను విచారణాధికారిగా నియమించింది. ఈ క్రమంలో విచారణ చేపట్టిన పోలీసు బృందాలు నలుగురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఎస్పీ రాజకుమారి మాట్లాడుతూ.. "29న రామతీర్థంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే ఆ ముందు రోజు అంటే 28న విగ్రహాల ధ్వంసానికి పాల్పడ్డారు. ఈ ఘటనలో 20 మందిని విచారిస్తున్నాం. రాజకీయ పార్టీలు సంయమనం పాటించాలి. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం" అని పేర్కొన్నారు. ఇక రాజకీయ నాయకుల పర్యటనల నేపథ్యంలో రామతీర్థం వద్ద పోలీసులను మోహరించారు.

# వాటర్ బాటిల్స్‌లో ఏది అసలు ఏది నకిలీ



## తెలియక మోసపోతున్న వినియోగదారులు

**జగ్గయ్యపేట -(ప్రజాపాలన):** మనం నిత్యం త్రాగే వాటర్ కలుషితమౌతున్నాయనే ఉద్దేశ్యంతో ప్రయాణాలలో బయట వాటర్ త్రాగటం సురక్షితం కాదని వివిధ కంపెనీలు తయారు చేస్తున్న లీటర్ వాటర్ బాటిల్స్ ని కొనుగోలు చేసి మరీ ఆరోగ్యాని కాపాడుకోవటం కోసం మినరల్ వాటర్ మంచి నీళ్ళ దాహార్తి తీర్చుకుంటున్నాము. ఎప్పుడో కాలజ్ఞానంలో బ్రహ్మం గారు నీటిని కొనుగోలు చేసి త్రాగుతారని వ్రాయగా ఆనాటి తరం ఏదేమి చోద్యోమ్నెనని ముక్కున వేలు వేసుకున్నారు. క్రమేపి యాంత్రిక జీవితంలో కాలుష్యం భూ మండలాని కబలించి వేస్తుంటే మనిషి స్వచ్ఛమైన నీరు,గాలి కోసం కొనుగోలు చేసుకుంటూ,ఇదే అదనుగా వీటి మీద వ్యాపారం చేసుకుంటూ కోట్ల రూపాయలు అర్జిస్తున్నారు. మన పురాణాలలో దాహం గొనవారికి గుక్కెడు మంచినీరు అందించి సహాయ పడాలనే నానుడు పోయి త్రాగు నీటి వ్యాపారం మినరల్ వాటర్ పేరుతో మూడు పూవులు ఆరు కాయలు గా మారింది. ప్రభుత్వాలు మాత్రం కుళాయి నీటిని కాచి చల్లార్చి త్రాగమని చెప్పుతుంటే వాటి గురించి పెడ చెవిన పెడుతున్నారు. ఇప్పటికే మంచినీటి కలుషితం పై ఏలూరులో జరిగిన సంఘటనలు ప్రజల ఆరోగ్య పరిస్థితి పై ప్రభావం చూపిందనే చెప్పకనే చెప్పవచ్చు. మార్కెట్ లో అమ్మే మినరల్ వాటర్ కంపెనీలలో కోకొల్లలు పుట్టుకొస్తున్నాయి. దీనిలో అంతర్జాతీయ,జాతీయ,స్థానిక కంపెనీలెన్నొ మార్కెట్ లో చలామణి అవుతున్నాయి. మార్కెట్ లో పుట్టగొడుగులులాగా వాటి స్థానంలో నకిలీ బాటిల్స్ కూడా తయారౌతూ అసలు కంపెనీలపై ప్రజలకున్న నమ్మకాని అవి వొమ్ము చేస్తున్నట్లుగా భావించవచ్చు. ఏది అసలు ఏది నకిలీ కన్నుగొన లేని పరిస్థితులలో వినియ్గోగదారులు ఉన్నారని,నాణ్యమైన త్రాగు నీటిని అందించేటప్పుడు నకిలీ వాటర్ బాటిల్స్ పై ప్రభుత్వం దృష్టి సారించి చర్యలు తీసుకొని వినియ్గోగదారులకు స్వచ్ఛమైన వాటర్ బాటిల్స్ కొనుగోలుకు అవకాశం ప్రభుత్వం కల్పించాలని సామాజిక కార్యకర్త మెటికల శ్రీనివాసరావు కోరారు.

# సేవారత్న అవార్డుతో యలిశల శ్రీనివాసరావుకు సత్కారం



**విజయవాడ, ప్రజాపాలన:** 2వ సారి బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర రాష్ట్ర కార్యదర్శి గా యలిశల శ్రీనివాసరావు ఎన్నికైన సందర్భంగా విజయవాడ పార్లమెంటు జిల్లా ఆఫీసు లో ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు బొబ్బూరి శ్రీరామ్ మాట్లాడుతూ 2వ సారి బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర రాష్ట్ర కార్యదర్శి గా ఎన్నికైన యలిశల శ్రీనివాసరావు 2014 నుంచి బీజేపీ పార్టీ లో అనేక పదవులు నిర్వహించి పార్టీ అభివృద్ధికి ఎంతగానో శ్రమించి ,ఈస్థాయి కి ఎదిగారన్నారు. ముమ్ముందు ఇంకా ఉన్నతమైన స్థాయిలో కి వెళ్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని అన్నారు. బీజేపీ ఎస్సీ మోర్చా లో ఉండీ ఎస్సీ ల సమస్యల పై అలుపెరగని పోరాటం చేసినందుకు గాను కాటూరి ట్రస్టు వారు "సేవ రత్న" అవార్డుతో యలిశల శ్రీనివాసరావు ని సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని ఎస్సీ మోర్చా నాయకులు మాతంగి ప్రకాష్ సర్వశుద్ధి రాజు నిర్వహించగా ఈ కార్యక్రమంలో పలువురు రాష్ట్ర, నగర నాయకులు పాల్గొన్నారు.

# బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా ఇత్తడి కిరణ్

## పలువురు బిజెపి నాయకుల అభినందనలు





**నరసరావుపేట. ప్రజాపాలన :** భారతీయ జనతాపార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి గా ఎంపికైన ఇత్తడి కిరణ్ కి నరసరావుపేట బీజేపీ నాయకుల అభినందన సత్కారం నిర్వహించారు. మల్లమ్మ సెంటర్లోని బీజేపీ పట్టణ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు రంగిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి గా ఎన్నికైన ఇత్తడి కిరణ్ ని భారతీయ జనతాపార్టీ నాయకులు, నరసరావుపేట ఎస్సీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు రంగిశెట్టిరామకృష్ణ మాట్లాడుతూ ఇత్తడి కిరణ్ దశాబ్దాలుగా పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేశారని వారు గతంలో పార్టీలో పట్టణ,జిల్లాలో అనేక పదవులు సమర్ధవంతంగా నిర్వర్తించారని, నరసరావుపేట మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ గా కూడా పనిచేశారని వారి సమర్థతను గుర్తించి భారతీయ జనతాపార్టీ రాష్ట్ర నాయకత్వం వారిని వరుసగా రెండవసారి ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా నియమించడం నరసరావుపేట నియోజకవర్గానికే గర్వకారణమని పేర్కొన్నారు. ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఇత్తడి కిరణ్ మాట్లాడుతూ తనపై నమ్మకముంచి తనకు ఇంతటి భాధ్యతలు ఇచ్చిన సోము వీర్రాజు నాయకత్వం లోని రాష్ట్ర పార్టీకి,ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె దేవానంద్‌కి కృతజ్ఞతలు తెలుపుతూ భారతీయ జనతాపార్టీ సిద్ధాంతాలను, బడుగు బలహీన వర్గాలకు చేరువగా తీసుకెళ్లి పార్టీని పటిష్టపరిచేందుకు తన శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. ఈ అభినందన సత్కారకార్యక్రమంలో సీనియర్ నాయకులు కాకుమాను కోటేశ్వర రావు, తవ్వా మల్లికార్జున్, అమ్మా జిలాని,కామినేని హనుమంతరావు, నాగసరపు బాబు,బత్తుల మురళి, మిరియాల నాగప్రసాద్,బీజేపీ బాషా, తాడువాయి సతీష్,చల్లా కోటేశ్వరరావు,సిద్ధ అనంత బ్రహ్మాచారి, పీరాట్ల మల్లికార్జున్ ,శిఖినం అనిల్ ప్రభుదాస్, ఎస్సీ నాయకులు బండి రమేష్, సాయి, పూర్ణ చంద్రరావు, జిడియన్, బాబు, అల్లబక్షు, పట్టణ ప్రధాన కార్యదర్శి వనువులేటి సుబ్బారావు పాల్గొన్నారు.

# క్రైస్తవ పాటల ఆల్బమ్ ఆవిష్కరణ



**నందిగామ, జనవరి 2 ప్రజాపాలన :** స్థానిక పాత బైపాస్ రోడ్ లోని ఆదరణ మినిస్ట్రీస్ ప్రార్ధనా మందిర ఆవ రణంలో ఏర్పాటు చేసిన నూతన సంవత్సర వేడుకల కు ముఖ్యఅతిథిగా నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బొక్కా జార్జి ముల్లర్ విచ్చేసి ఆదర ణ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు పాస్టర్ క్రిస్టఫర్ రచించి స్వరపరచిన లిసీయోనులో కలిసి ఉండాలనిపాటల ఆల్బమ్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ ముల్లర్ మాట్లాడుతూ ప్రపంచంలో ఎన్నో వేల పాటల ఆల్బమ్లు ప్రతి సంవత్సరం విడుదల అవుతున్నాయ ని వాటిలో క్రైస్తవ సంగీతానికి ప్రత్యేకమైన స్థానం ఉందని,సంగీతం భక్తిలోనూ ఆరాధనలోనూ అంతర్లీనం అయిపోయిందని,ఇంకా అనేకమంది క్రైస్తవ సంగీతకళాకారులు,సంగీతవాయిద్యకారులు,సాహితీవేత్తలు, ఆంధ్రప్రదేశ్లో గుర్తింపబడిన స్థాయిలోనికి రావా లని ఆకాంక్షించారు. అద్భుతమైన క్రైస్తవ ఆల్బమ్ను అందించిన పాస్టర్ క్రిస్టఫర్ ను ప్రత్యేకంగా అభినందిం చారు.

# సావిత్రి బాయి ఫూలే జయంతి సభలను ఘనంగా జరుపుకుందాం

మిత్రులారా,అమ్మ సావిత్రి బాయి ఫూలే 190 వ జయంతి సభలను జనవరి 3 వ తేదీన అన్ని ప్రాంతాలలో ఘనం గా జరుపుకుందాము..జాతీయ స్థాయి లో కేంద్రం మరియు రాష్ట్ర స్థాయి లో అన్ని ప్రభుత్వాలు అధికారకంగా సావిత్రి బాయి ఫూలే జయంతి మహిళా ఉపాధ్యాయ దినోత్సవం గా ప్రకటించాలని గత పుష్కర కాలం గా మన సావిత్రి బాయి ఫూలే ఎడ్యుకేషనల్ & చారిటబుల్ ట్రస్ట్ మరియు వివిధ బహుజనుల సంఘాలు డిమాండ్ చేస్తున్న విషయం మీకు తెలిసిందే..వివిధ రంగాలలో నిస్వార్ధం గా సమాజానికి సేవలు అందిస్తున్న వ్యక్తులకు,సామాజిక సేవా సంస్థలకు సావిత్రి బాయి ఫూలే విశిష్ట సేవా పురస్కారాలు అందిస్తూ వచ్చాము..

వారి సేవలను అభినందిస్తూ సావిత్రి బాయి ఫూలే స్ఫూర్తి తో ఆమె వారసులుగా ఉన్నత మానవీయ విలువలు కలిగిన సమ సమాజ స్థాపనకు వారి కృషిని మరింత ఉన్నతంగా కొనసాగేలా ప్రోత్సాహిస్తు వస్తున్నాము..అదే విధంగా గా ఈ ఏడాది కూడా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న మహిళలకు సావిత్రి బాయి ఫూలే పురస్కారాలు అందజేస్తున్న ము..గత ఏడాది అంబేడ్కర్ రాజనీతి ఉద్యమం .అంబేడ్కర్ మాస్టర్ కీ టీవీ చానెల్ పక్షాన చేసిన తీర్మానం మేరకు అమ్మ సావిత్రి బాయి ఫూలే జయంతి సభలను ఘనంగా అన్ని జిల్లాల్లో చెయ్యాలని సంకల్పించి నప్పటికీ కరోనా కారణం గా పరిమిత స్థాయి లో జరపటానికి ప్రయత్నం చేస్తున్నాము .

స్పెక్ట్ ( సావిత్రి బాయి ఫూలే ఎడ్యుకేషనల్ & చారిటబుల్ ట్రస్ట్) అంబేడ్కర్ రాజనీతి ఉద్యమం సంయుక్త నిర్వహణ లో హైదరాబాద్, లకాడికాపూల్ , దౌలత్ ప్లాజా లో గల స్నేహ టీవీ కార్యాలయం పై అంతస్థులో జనవరి 3 వ తేది,ఆదివారం సాయంకాలం 5 గంటలకు జరిగే జయంతి సభలో సావిత్రి బాయి ఫూలే విశిష్ట సేవా పురస్కారాలు ప్రధానం చేస్తున్నాము..

రెండు తెలుగు రాష్ట్రాలనుండి పురస్కారాలకు ఎంపికైన మహిళలు కరోనా కు సంభందించి తగు జాగ్రత్తలు తీసుకుని హైదరాబాద్ రావలసిందిగా ఆహ్వానిస్తున్నాము.. హాజరు కాలేని వారికి మా ఏఆర్ఎం జిల్లా బాధ్యులు ద్వారా సర్టిఫికేట్ ,మెమెంటో అందజేస్తాం..

హైదరాబాద్ పాల్గొనే సభలో పాల్గొనే అతిథుల వివరాలు అంబెడ్కర్ రాజనీతి మూవ్మెంట్ సి డబ్ల్యూ సి మెంబెర్ డాక్టర్ యం సురేష్ బాబు కన్వీనర్ గా వ్యవహరిస్తున్నారు..ప్రతి ఏడాది అత్యంత ఘనం గా విశాఖ పట్నంలో పండుగ వాతావరణంలో జరుపుకునే జయంతి సభ, ఈ సారి పరిమిత సంఖ్య లో ముఖ్య కార్య కర్త లతో జరుపుతున్నాము. విద్య , వైద్యం, ప్రభుత్వ అధికారులు , పత్రిక , రచయితలు, సామజిక సేవ రంగాలలో విశిష్ట సేవ కనపరచిన అవార్డు గ్రహీతలకు సన్మానించబడును.

ఇంజినీరు దడాల మేరీ సుధ దార రోజ్ మేరీ కొమండూరి హేమలత డాక్టరు కౌతాళం అనిత డాక్టరు ధర్మవరం ఆశాదేవి శ్రీ షఫి ఉన్నీసా సయ్యద్ శ్రీమతి అరుంధతి శ్రీమతి సి శైలజ శ్రీమతి ఏం శోభారాణి డాక్టర్ జ్ఞాన కుమారి డాక్టర్ శారద వెంకటేష్ డాక్టర్ ఎస్ రాజేశ్వరి డాక్టర్ చింతా శివ శ్వేత శ్రీమతి అమృతమ్మ డాక్టర్ సి మంజులత డాక్టర్ జూపాక సుభద్ర డాక్టర్ కే భావన రాజ్ డాక్టర్ ఏ శకుంతల శ్రీమతి రామక్క శ్రీమతి కె సంగీత శ్రీమతి మనీషా కృష్ణపుర్కర్ శ్రీమతి అవ్వ విజయలక్ష్మి శ్రీమతి శివ పార్వతి శ్రీమతి వైష్ణవి శ్రీమతి గుత్తికొండ అనుజా శ్రీమతి సిరికొండ రమాదేవి శ్రీమతి టి లక్ష్మి శ్రీమతి కోస్గి లక్ష్మి శ్రీమతి డేరంగుల లక్ష్మీదేవి శ్రీమతి కట్టుపల్లి భవాని శ్రీమతి అజీమా శ్రీమతి శోభా బాయి శ్రీమతి కె భారతి శ్రీమతి మందల రామలక్ష్మి షేక్ సాజిదా బేగం శ్రీమతి ఎక్కుళ్ళ సుధా మణెమ్మ శ్రీమతి కె ఎర్రమ్మ శ్రీమతి లక్ష్మి రాములు శ్రీమతి మీరమ్మ శ్రీమతి నిర్మల కుమారి శ్రీమతి దుర్గాభవాని శ్రీమతి తోమాల లక్ష్మి శ్రీమతి జోరేగెహాలక్ష్మి చైతన్య శ్రీమతి సి హెచ్ కళావతి శ్రీమతి కే పద్మావతి శ్రీ గంజి మౌనిక శ్రీమతి మువ్వా బుజిమ్మ శ్రీమతి జి నిర్మల రాణి మోటూరి మంగ రాణి డాక్టర్ సయిాద్ సమీనా సుల్తానా పిల్లా నాగ రేవతి నాయని ఇందిరా దేవి కె వెంకటరత్నమ్మ






# చంద్రబాబు కుట్రలను తిప్పికొట్టాలి: పార్ధసారధి

**విజయవాడ, జనవరి 2 (ప్రజా పాలన) :** ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు కుట్రలను తిప్పికొట్టాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కొలుసు పార్థసారధి అన్నారు.

శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమపాలన చేస్తుంటే.. చంద్రబాబు కుట్రలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఎంపీ విజయసాయిరెడ్డిపై టీడీపీ నేతలు ఉద్దేశపూర్వకంగానే దాడి చేశారన్నారు. రామతీర్థం ఘటనకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షిస్తామని పేర్కొన్నారు.

అంతర్వేది ఘటనపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని రథం నిర్మాణం చేపట్టి పూర్తి చేసిందన్నారు.

"రాష్ట్రంలో పండగ వాతావరణాన్ని భగ్నం చేయాలని చంద్రబాబు చూస్తున్నారు. లోకేష్ మాటలకు రాష్ట్రంలో విలువలేదని" ఎమ్మెల్యే పార్థసారధి విమర్శించారు.

ప్రజాపాలన

సంపాదకీయం

ఆదివారం 3 జనవరి 2021

# రైతు ఉద్యమానికి విశాల మద్దతు

రైతు అనుభవం నుండే ఈ ఉద్యమం పుట్టుకొచ్చింది. ఎవరో పథకం రచిస్తే వచ్చింది కాదు. ఉద్యమం వెల్లువలా వచ్చాకే ప్రతిపక్షాలు బలపరుస్తు న్నాయి. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇంత కన్నా ఎక్కువగానే బిజెపి గావుకేకలు పెట్టింది. అంతేకాక, ఈ ఉద్యమానికి బిజెపి మిత్రపక్షాలు కూడా మద్దతునిస్తున్నాయి. హర్యానా, రాజస్థాన్, పంజాబుకి చెందిన కొన్ని పార్టీలు ఎన్‌డిఏ కూటమి నుండి తప్పుకున్నాయి. ఆర్‌యస్‌యస్ అనుబంధ స్వదేశీ జాగరణ మంచ్ ఈ చట్టాలను వ్యతిరేకిస్తున్నది. కేరళలో వారి ఏకైక ఎంఎల్‌ఏ చట్టాలకు వ్యతిరేకంగా రాష్ట్ర అసెంబ్లీ చేసిన తీర్మానానికి పరోక్షంగా మద్దతునిచ్చారు. బిజెపి ఏకాకి అయిందనడానికి, వారికి ఈ చట్టాలు కొనసాగించడానికి నైతిక హక్కు లేదనడానికి ఇంత కంటే సాక్ష్యం ఏం కావాలి ?

ముప్పై ఏడు రోజులుగా సాగుతున్న రైతు ఉద్యమం రోజురోజుకీ మరింతగా బలపడుతోంది. ఉద్యమానికి దూరంగా ఉన్న ప్రజల నుండి కూడా అపూర్వ సంఘీభావం వ్యక్తమవుతోంది. చర్చల ద్వారా సామరస్యపూర్వకంగా పరిష్కరించాల్సిన సమస్యను మోడీ మొండితనంతో చిక్కుముడి పడుతోంది. ఈ నల్ల చట్టాలు మాకొద్దు మహాప్రభో అని రైతులు మొత్తుకుంటున్నా ఈ చట్టాలు ఎంత గొప్పవో చెప్పడానికి మోడీ ఉవ్విళ్లూరుతున్నారు. కార్పొరేట్ దన్నుతో ఆయన చెవులు, కళ్లు మూసుకుపోయాయి. ప్రతిపక్షాలు రైతుల్ని తప్పుదారి పట్టిస్తున్నాయని, ఉగ్రవాదులు హైజాక్ చేశారని ఇలా రోజుకో ఆరోపణ చేస్తూ ఉద్యమాన్ని అప్రతిష్టపాలు చేయాలని చూస్తున్నారు. కాని ప్రజలు మోడీ మాటల్ని పట్టించుకోవడం లేదు. రైతుల పట్ల సానుభూతితో ఉన్నారు. ఈ స్థితిలో జనాన్ని నమ్మించడానికి చర్చలు ప్రారంభించినా ఆరో దఫా చర్చల్లో స్వల్ప పురోగతి వున్నట్లు పరిశీలకులు భావిస్తున్నారు. కాని కీలకమైన డిమాండ్లపై ప్రభుత్వం స్పందించలేదు. పాత మూస లోనే సమాధానాలు ఇచ్చారు. కమిటీ వేస్తామని, మద్దతు ధరపై హామీ ఇస్తామని అరిగిపోయిన రికార్డునే వేశారు. దానితో చర్చలు 4వ తేదీకి వాయిదా పడ్డాయి.

మన రాష్ట్రం లోనూ రైతు ఉద్యమం ఊపందుకుంటోంది. తొలుత రకరకాల కారణాలతో దీని పట్ల అనాసక్తిగా ఉన్న రైతాంగంక్రమంగా కళ్లు తెరుస్తోంది. ప్రతి గ్రామంలోనూ కిసాన్ జ్యోతి కార్యక్రమం జయప్రదమైన తీరే ఇందుకు నిదర్శనం. పార్టీలకతీతంగా రైతులు వాటిల్లో పాల్గొని నల్ల చట్టాలకు నిరసన తెలియచేశారు. సదస్సులు పెట్టి రైతులకు నచ్చచెప్పాలనుకున్న బిజెపి ప్రయత్నాలు ఫలించలేదు. అందులోనూ మన రాష్ట్రంలో బిజెపి కి విశ్వసనీయత లేదు. ప్రత్యేక హోదా ఇస్తామని, విభజన హామీలు అమలు చేస్తామని నమ్మించి మోసం చేసిన రికార్డు వారిది. తిరుపతిలో అన్యమతస్తుల కార్యకలాపాల గురించి గోల చేస్తున్న బిజెపి, ఆ తిరుపతి దేవుడి సాక్షిగా ప్రత్యేక హోదా ఇస్తామని చేసిన వాగ్దానాన్నే మట్టిలో కలిపేశారు. వారికి దేవుడి మీద గౌరవం, భక్తి లేదని, అదంతా పదవులు, అధికారం కోసం ఆడే నాటకమని జనానికి క్రమంగా అర్థమవుతోంది. అందుకే మద్దతు ధరలపై మోడీ మాటల్ని మన రాష్ట్ర ప్రజానీకం విశ్వసించడం లేదు. ఢిల్లీలో జరుగుతున్న ఉద్యమంతో మన రైతాంగమూ మమేక మవుతోంది.

డిసెంబరు 27వ తేది మన్ కీ బాత్ కార్యక్రమంలో మోడీ మాట్లాడుతూ స్వదేశీ వస్తువుల్నే కొనమని జనానికి హితోపదేశం చేశారు. స్వదేశీపై భక్తి కాదు అది. నిజంగా ఆయనకు స్వదేశీపై భక్తి వుంటే ముందు విదేశీ పెట్టుబడుల్ని, కంపెనీలను నిషేధించాలి. అంబానీ, అదానీలు చైనాతో సహా విదేశీ కంపెనీలతో వ్యాపార కార్యకలపాలు సాగిస్తున్నారు. ఫేస్‌బుక్, వాట్సప్ వంటి విదేశీ కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నారు. కొత్త చట్టాల ప్రకారం వ్యవసాయం లోకి మాన్‌శాంటో, వాల్‌మార్టు వంటి విదేశీ పెట్టుబడులు మిళితమై వస్తున్నాయి. మన రాష్ట్రానికి గర్వకారణంగా భావించే విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని దక్షిణ కొరియాకు చెందిన పోస్కోకు అప్పగించడానికి సిద్ధపడింది. పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కును కాపాడుకోవడానికి స్టీలు కార్మికులు నడుం కట్టి పోరాడుతున్నారు. విదేశీ కంపెనీల కోసం స్వదేశీ ఉద్యమాలను, రైతులను, కార్మికులను అణచి వేస్తూ స్వదేశీ జపం చేయడమంటే దెయ్యాలు వేదాలు వల్లించ డం లాంటిదే. ఆయన స్వదేశీ బ్రాండు పేరు 'నమస్తే ట్రంపు'.

ఈ ఆరేళ్లలో మోడీ విధానాల వల్ల రైతు ఆత్మహత్యలు పెరిగాయి. భూములు కోల్పోయారు. భూమి లేని వారి సంఖ్య 35 నుండి 49 శాతానికి పెరిగింది. ఈ సంస్కరణల వల్ల ఈ పరిణామం మరింత వేగంగా జరుగుతుంది. కాని మీ భూములు ఎక్కడికీ పోవని నంగనాచి కబుర్లు చెప్తున్నారు. భూములు ఎక్కడికీ పోవు. ఎవరూ వాటిని నెత్తిన పెట్టుకొని తీసుకొని పోలేరు. కాని రైతుల యాజమాన్యంలో ఉండవు. అంతే.

ఈ చట్టాలు వచ్చిన ఈ మూడు నెలల్లోనే ఆదాయాలు ఎలా పడిపోయాయో ఏ రైతునడిగినా చెపుతాడు. ధాన్యం ధర బస్తాకి రెండు వందలకు పైగా తగ్గిపోయింది. ఈ రోజు రైతులు అమ్ముకుంటున్న మంచి రకం ధాన్యానికి స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం చూస్తే బస్తాకి రూ. రెండు వేలు రావాలి. మార్కెట్లో బియ్యం ధరలను బట్టి చూస్తే బస్తా ధాన్యానికి రూ. మూడు వేలు రావాలి. కాని రైతులు అమ్ముకుంటున్నది రూ. 12 వందలు లేదా రూ. 13 వందలకే. దీనికి కారణం ఎవరు? ఈ మార్కెట్ శక్తులకు అధికారం ఇవ్వడం వల్ల కాదా? వారు దయతో రెట్టింపు ధర ఇస్తారని, ఇంకా బోనస్ కూడా ఇస్తారని కార్పొరేట్ కంపెనీల తరపున వకాల్తా పుచ్చుకొని మోడీ వాదిస్తున్నారు. కాని అంగీకరించిన ధరకు కూడా కొనకపోతే ఈ ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయి. సుబా బుల్ టన్నుకి రూ. 4200కు కొంటామని ఐటిసి మాట ఇచ్చింది. ప్రభుత్వం జీవో తెచ్చింది. కాని ఇప్పుడు రూ. 1800కు కూడా కొనడం లేదు. కూరగాయలు ధర లు చూస్తే మండిపోతున్నాయి. రిలయన్సు ఫ్రెష్ షోరూంలో గురువారం కిలో దొండకాయలు రూ. 48. అదే రోజు రైతు బజారులో రూ. 28. కాని పొలంలో రైతులు అమ్ముకున్నది రూ. 14 లకే. దీన్నేమనాలి? ప్రభుత్వం బాధ్యత నుండి తప్పుకొని కార్పొరేట్ల దయాదాక్షిణ్యాలకు వదిలేస్తే రైతులకు దిక్కెవరు ?

కేరళలో మార్కెట్ యార్డులే లేవని మోడీ కొత్త సత్యాన్ని కనిపెట్టారు. నిజమే. అక్కడ మార్కెట్ యార్డుల చట్టమే లేదు. కాని ప్రతి పంటకు ప్రత్యేక బోర్డులున్నాయి. వేలం కేంద్రాలున్నాయి. ధాన్యం కొనుగోలుకు సహకార వ్యవస్థలున్నాయి. దేశంలోనే ఆదర్శవంతంగా ధాన్యం మద్దతు ధరకు కేంద్రం కన్నా రూ. 900 అదనంగా నిర్ణయించి కొనుగోలు చేస్తున్నది. స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం ధర నిర్ణయించిన ఏకైక రాష్ట్రం కేరళ. అక్కడ బలమైన సహకార వ్యవస్థ ఉంది. ప్రజా పంపిణీ వ్యవస్థ ఉంది. వాటిని నాశనం చేయడానికి మోడీ సర్కారు కంకణం కట్టుకుంది. దేశంలోనే ప్రప్రథమంగా కూరగాయలకు కనీస ధర నిర్ణయించి అమలు చేస్తోంది. కాని బిజెపి అధికారంలో ఉన్న మధ్యప్రదేశ్ లో ప్రైవేటు కంపెనీలు రైతుల వద్ద కొనుగోలు చేసి ఉత్పత్తులకు డబ్బులు చెల్లించకుండా ఐపీ పెడితే ఆదుకునే నాథుడే లేదు. రైతులు కేసులు పెట్టినా నిందితులను పట్టుకొని శిక్షించలేదు. బీహారులో 2006లో మార్కెట్ యార్డులను రద్దు చేశారు. అప్పటి నుండి ధాన్యం ధరలు పడిపోయాయి. కాని బియ్యం ధరలు పెరుగుతూనే ఉన్నాయి. పంజాబు మార్కెట్ యార్డుల్లో ఎఫ్‌సిఐ ద్వారా అమ్ముకునే ధర కన్నా బీహారులో 30 శాతం తక్కువ ఉంది. దీనికి బిజెపి ఏం సమాధానం చెపుతుంది. అందుకే విఫలమైన ఈ దివాళాకోరు విధానాలనే రైతులపై రుద్దడానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నారు.

ఈ ఆందోళన చాలా న్యాయసమ్మత మైంది. రైతు అనుభవం నుండే ఈ ఉద్యమం పుట్టుకొచ్చింది. ఎవరో పథకం రచిస్తే వచ్చింది కాదు. ఉద్యమం వెల్లువలా వచ్చాకే ప్రతిపక్షాలు బలపరుస్తున్నాయి. గతంలో ప్రతివక్షంలో ఉన్నప్పుడు ఇంతకన్నా ఎక్కువగానే బిజెపి గావుకేకలు పెట్టింది. అంతేకాక, ఈ ఉద్యమానికి బిజెపి మిత్రపక్షాలు కూడా మద్దతునిస్తున్నాయి. హర్యానా, రాజస్థాన్, పంజాబుకి చెందిన కొన్ని పార్టీలు ఎన్‌డిఏ కూటమి నుండి తప్పుకున్నాయి. ఆర్‌యస్‌యస్ అనుబంధ స్వదేశీ జాగరణమంచ్ ఈ చట్టాలను వ్యతిరేకిస్తున్నది. వారిని సంతృప్తి పర్చడానికే మోడీ స్వదేశీ జపం చేస్తున్నాడు. ఈ చట్టాలను మార్చాలని వారి కిసాన్ సంఘ్ బహిరంగంగా డిమాండు చేసింది. కేరళలో వారి ఏకైక ఎంఎల్‌ఏ చట్టాలకు వ్యతిరేకంగా రాష్ట్ర అసెంబ్లీ చేసిన తీర్మానానికి పరోక్షంగా మద్దతునిచ్చాడు. బిజెపి ఏకాకి అయిందనడానికి, వారికి ఈ చట్టాలు కొనసాగించడానికి నైతిక హక్కు లేదనడానికి ఇంత కంటే సాక్ష్యం ఏం కావాలి? ఇప్పటికైనా మొండిగా ముందుకు పోకుండా రైతుల అభిప్రాయాలను గౌరవించి ఈ చట్టాలను ఉపసంహరించుకొని రైతులు కోరుతున్న ప్రత్యామ్నాయ చట్టాలపై చర్చ చేయాలి. గిట్టుబాటు ధరల చట్టం, రుణ విమోచన చట్టం చేయాలి. అందుకు పార్లమెంటును సమావేశ పరచాలి.

మన రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టాల పట్ల గోడ మీది పిల్లి వాటంగా వ్యవహరిస్తోంది. పార్లమెంటులో చట్టాలను బలపరచి నేడు ఏమీ తెలియనట్లు వ్యవహరిస్తోంది. మాటల్లో సంఘీభావం ప్రకటించడం కాదు. రైతుల పక్షాన నికరంగా నిలబడి ఈ చట్టాలకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలి. తద్వారా తాను రైతు పక్షపాతినని నిరూపించుకోవాలి. ప్రధాన ప్రతిపక్షంగా తెలుగుదేశం ఈ ఉద్యమంపై నోరు మెదపడం లేదు. ఇంతకన్నా అన్యాయం మరొకటి లేదు. ఈ రెండు పార్టీలు దేశవ్యాప్తంగా సాగుతున్న రైతాంగ ఉద్యమాన్ని ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తున్నాయి. బిజెపికి సహకరించే విధానాలకు స్వస్తి చెప్పి రైతుల తరపున నికరంగా నిలబడాలి.

జనవరి 4 చర్చలు మరో దఫా జరుగనున్న సందర్భంగా రైతు పోరాట కమిటీ మోడీ మొండి విధానానికి నిరసనగా ర్యాలీలు నిర్వహించనుంది. మన రాష్ట్రంలో ప్రత్యేకించి విజయవాడలో జరుగనున్న ట్రాక్టరు ర్యాలీని జయప్రదం చేయాలి. ప్రతి ఒక్కరూ దానికి సహకరించాలి. రాష్ట్ర ప్రభుత్వం కూడా సంఘీభావం తెలియచేయాలి. అదే ముఖ్యమంత్రి రైతులకిచ్చే నూతన సంవత్సర కానుక అవుతుంది.

## చీకట్లను తరిమిన దివ్వే

### 'సావిత్రి బాయి పూలే'

దేశం అంధకారాలు అలుముకుని
కనుమరుగవుతోంది
జాతి మొత్తం దిక్కుమొక్కు లేక
ఓ అమాస గుహలా
నిర్బంధంలోకూరుకుపోయింది
మానవ మెదళ్ళు
కులం కంపులో కొట్టుకుంటూ
మతంముసుగులోమారణహోమం
జరుపుకుంటూ
చీకటి రాజ్యాలు ఏలుతుంటే
ఒకానొక ఎడారి ప్రాంతంలో
దేశంలో చదువుకోసం గావుకేకలు పెట్టి
నీటి చెలమలులేని బతుకులా
జాతి గొంతులు ఎండిపోతున్న వేళ
జాతి జనుల దప్పిక తీర్చటానికి
ఓ చల్లని హృదయం
ఒయాసిస్సులా ఉద్భవించింది
కరుడుగట్టిన గుండెలకు
ఆమే ఓ చదువుల ధిక్కారమై
వెన్నులో వణుకు పుట్టించింది
కులం తాలుకు మూలాలను
ఎడం కాలుతో తంతూ
గుండెల్ని కభళించేలా
కాలం కొలిమి నిప్పుల సెగల గుండా
సరికొత్త దేశచరిత్ర
ఆమె పేరుతో లిఖించబడింది
భారతదేశ మొట్టమొదటి
'చదువుల తల్లి 'ఉపాధ్యాయురాలు '
సావిత్రి బాయిపూలే '

( రేపు జనవరి 3న భారతదేశ మొట్టమొదటి ఉపాధ్యాయురాలు 'సావిత్రి బాయి పూలే జయంతిసందర్భంగా )

**తంగిరాల – సోని**
**96 766 09 234**

# సామాజిక విప్లవకారిణి సావిత్రిభాయిఫూలే

## (తేది: 3/1/2021 సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా)

సావిత్రిబాయి ఫూలే భారతీయ సంఘసంస్కర్త, మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయిని మరియు రచయిత్రి. ఆమె నిమ్న వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన జ్యోతీరావు ఫులే భార్య. కులమత భేదాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమస్వరూపిణి. విద్య ద్వారానే సమాజంలో మార్పు తీసుకురావడం సాధ్యమని భావించిన ఫూలే దంపతులు బాలికలకోసం, శూద్ర, అతి శూద్రుల కోసం పాఠశాలలను ప్రారంభించారు. బాలికలకు విద్యను అందించినందుకు వీరికి సమాజం నుంచి దాడులు, విమర్శలే ఎదురయ్యాయి. జ్యోతిరావుఫూలే తన భార్య సావిత్రిభాయికు చదువు నేర్పి ఉపాధ్యాయ శిక్షణ ఇప్పించారు. అగ్రకుల మహిళలకి కూడా చదువుకునే అవకాశం లేని రోజుల్లోనే సావిత్రిభాయిఫూలే సమాజ కట్టుబాట్లను ఎదిరించి భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయునిగా, మొదటి శూద్ర మహిళా ఉపాధ్యాయునిగా బాలికలకు విద్యను అందించి చరిత్ర సృష్టిచింది. ఆడవాళ్ళు ఇంటి గడప దాటి బయట అడుగు పెట్టేందుకు వీలులేని రోజుల్లో ఆమె పాఠాలు బోధించడానికి విద్యాలయానికి వెళ్ళేటపుడు అనరాని మాటలు అన్నారు, వినరాని తిట్లు తిట్టారు. ఆమెపై అగ్రకుల పురుష ప్రపంచం దాడి చేసింది. ఆమెపై బురద, రాళ్లు విసరడం చేశారు. బురదతో మలినమైన చీరను పాఠశాలకు వెళ్లిన తరువాత మార్చుకుని, మరల వచ్చేటప్పుడు బురద చీరను కట్టుకుని వచ్చేది. ఎవరైనా అడిగినప్పుడు ధైర్యంగా 'నా విధిని నేను నిర్వహిస్తున్నాను' అని చెప్పేది. ఎన్ని అడ్డంకులు ఎదురయినా తన లక్ష్యం కోసం ముందుకు సాగింది. వెనకడుగు వేయలేదు. తన జీవితాన్ని త్యాగం చేసి విద్యాబోధనకు, బాలికలకు అంకితమైంది. విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని నమ్మిన సావిత్రిబాయి భర్తతో 1848 సంవత్సరం పూణేలో మొట్టమొదటగా బాలికల పాఠశాలను ప్రారంభించింది. కుల వ్యవస్థకు, పితృస్వామ్యానికి వ్యతిరేకంగా, శూద్రుల, అస్పృశ్యుల, మహిళల సకల హక్కుల కోసం పోరాటం చేసింది. నూతన వ్యవస్థ కోసం, ప్రాణాల్ని సైతం ఫణంగా పెట్టి పోరాటం చేసింది. ఆమె మహారాష్ట్ర సతారా జిల్లాలో నయాగావ్ అనే గ్రామంలో 1831 జనవరి 3న జన్మించింది. ఆమెది రైతుకుటుంబం. సావిత్రిబాయి కుటుంబానికి తెలంగాణ ప్రాంతంతో బంధుత్వం ఉంది. వీరి బంధువులు నిజామాబాద్ జిల్లాలో బోధన్ నాందేడ్ కొండల్ వాడి ప్రాంతంలో, అదిలాబాద్ చుట్టుపక్కల ఉన్నారు. బోధన్ ప్రాంతపు



మున్నూరుకాపులు వీరికి చుట్టాలు. సావిత్రి బాయి తన తొమ్మిదవ యేట పన్నెండు యేండ్ల జ్యోతిరావు ఫూలెను 1840లో వివాహమాడారు. ఆ దంపతులకు స్వంత పిల్లలు లేరు. కానీ యశ్వంతరావు (బ్రాహ్మణ వితంతువు కుమారుడు)ను దత్తత తీసుకున్నారు. "జ్యోతీరావు ఫూలె" ప్రోత్సాహంతోనే ఇంట్లోనే అక్షరాభ్యాసం చేసి విద్యావంతురాలైంది.

అహ్మద్ నగర్ లో ఉపాధ్యాయునిగా శిక్షణ పొంది 1848 లో భర్త జ్యోతిరావుతో కలిసి నిమ్న కులాల బాలికల కోసం పూణేలో మొదటి పాఠశాలను ప్రారంభించారు. అట్టడుగు వర్గాలు, మహిళలకు చదువు, సంపద, గౌరవం వంటి సమస్త హక్కులు నిరాకరింపబడిన ఈ దేశంలో ఆనాటి సమాజపు కట్టుబాట్లను, బ్రాహ్మణవాద సంప్రదాయాలను, ఆధిపత్యవర్గాలను ధిక్కరించి భారతదేశపు మొట్టమొదటి ఉపాధ్యాయురాలుగా 12 మే 1848న దేశంలో బహుజనులకు మొట్టమొదటి పాఠశాల ప్రారంభించారు. సమాజంలో ఎన్ని అవమానాలు ఎదురైనా మడమ తిప్పని ధీశాలి ఆమె. కేవలం 4 సంవత్సరాలలోనే గ్రామీణ ప్రాంతాల్లో 20 పాఠశాలలను ప్రారంభించి ఉచిత విద్యనందించారు.

1848లోనే దేశంలో విద్యా ఉద్యమం ప్రారంభించారు. దళితుల, స్త్రీల విద్యా వ్యాప్తికి పాఠశాలలను ప్రారంభించే నాటికి ఆమె వయస్సు 18 ఏళ్ళు మాత్రమే. వారి జీవితకాలంలో మొత్తం 52 పాఠశాలలు ప్రారంభించారు. అయితే ఈ క్రమంలో ఆమె ఆధిపత్య కులాల వారి నుంచి అనేక దాడులను, అవమానాలను ఎదుర్కొన్నది. ఈ నేపథ్యంలోనే 1849లో పూలే, సావిత్రీబాయి దంపతులు గృహ బహిష్కారానికి గురి అయ్యారు. ఆమె మానవ హక్కుల గురించి ఇతర సామాజిక సమస్యల గురించి స్త్రీలను చైతన్యపరచడానికి 1852లో మహిళా సేవామండల్ అనే మహిళా సంఘాన్ని కూడా స్థాపించింది. ఈ సంస్థ స్త్రీసమస్యలకు తోడుగా, కుల పితృస్వామ్య వ్యవస్థల అణచివేతకు వ్యతిరేకంగా స్త్రీల సాధికారిత కోసం కృషిచేసింది.

మహిళా హక్కులే మానవ హక్కులని తొలిసారిగా నినదించినది సావిత్రి భాయి పూలే. అసత్యాలతో, అగ్రవర్ణ దురహంకారపు నిచ్చెనమెట్ల కులవ్యవస్థగా నిర్మాణమైన సమాజంలో "సత్యాన్ని" శోధించడానికి 1873లో తన భర్త మహాత్మా జ్యోతి రావు పూలేతో కలసి "సత్యశోధక్ సమాజ్"ను ప్రారంభించి బాల్యవివాహాలకు, మూఢనమ్మకాలకు, సతీసహగమనానికి వ్యతిరేకంగా, మరియు వితంతువు పునఃర్వివాహాల కొరకు బ్రాహ్మణవ్యవస్థకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమం నడిపారు. బాల్యంలోనే వైధవ్యాన్ని అనుభవించే ఎంతో మంది ఆడపిల్లలకు అన్నం పెట్టి ఆశ్రయం కల్పించారు. గర్భవతులైన వారికి పురుళ్లు పోసి వారి కళ్లల్లో వెలుగు చూసారు. అలా పురుడు పోసుకుని తన వద్ద వదిలేసి పోయిన ఓ బిడ్డను అక్కున చేర్చుకున్నారు.

యశ్వంత్ గా నామకరణం చేసి తమ ఆశయాలకు, ఆకాంక్షలకు అనుగుణంగా పెంచి పెద్ద చేసారు. వితంతువులకు శిరోముండనం చేయడాన్ని తీవ్రంగా ఖండించి, క్షురకులను చైతన్యపర్చి, వితంతువులకు శిరోముండనం చేయబోమంటూ క్షురకుల చేత 1860లో సమ్మె చేయించారు సావిత్రీబాయి. తరువాత 1873 సెప్టెంబరు 24న "సత్య శోధక్ సమాజ్" అనే సామాజిక, ఆధ్యాత్మిక సంస్థను ప్రారంభించి, సత్య శోధన కోసం ఉద్యమాన్ని నడిపారు పూలే.

ఈ సత్య శోధక్ సమాజ్ మహిళా విభాగం సావిత్రీబాయి నేతృత్వంలో నడిచేది. వివాహాలు వంటి శుభ కార్యాలను పురోహితులు లేకుండా నిర్వహించే విధానాన్ని ఈ సంస్థ ప్రారంభించింది. 1873 డిసెంబరు 25న భార్యను కోల్పోయిన ఒక యువకునికి తన స్నేహితురాలి కుమార్తెతో సత్య శోధక్ సమాజ్ ఆధ్వర్యన సావిత్రీబాయి వివాహం జరిపించారు. 1868 నుంచి సావిత్రీబాయి అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడారు. 1870లో ఒకసారి 1896లో మరోసారి దేశంలో తీవ్ర దుర్భిక్షం ఏర్పడినప్పుడు పూలే దంపతులు చేసిన కృషి అనన్య సామాన్యం. కరువు వాతపడిన కుటుంబాలలోని అనాథ బాలలను దాదాపు 2,000 మందిని అక్కున చేర్చుకున్నారు. దుర్భరమైన కరువు పరిస్థితుల్లో కూడా రోజుకు రెండు వేల మంది పిల్లలకు భోజనాలు పెట్టించింది. తమ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రారంభించారు. సావిత్రిబాయి సంఘసంస్కర్తగానే కాదు, రచయిత్రిగా కూడా వేగుచుక్కగా నిలిచారు. 1854లోనే ఆమె తన కవితా సంపుటి 'కావ్యఫూలే'ను ప్రచురించింది. మరో కవితా సంపుటి 'పావన కాశీ సుభోధ్ రత్నాకర్'ను 1891లో ప్రచురించింది. ఆమె ఉపన్యాసాల్లో కొన్ని 1892లో పుస్తకరూపంలో వచ్చాయి.

జ్యోతీరావుపూలే 1890 నవంబరు 28న మరణించడంతో సావిత్రీబాయి అంతులేని దుఃఖ సాగరంలో మునిగిపోయారు. ఈ దుఃఖంలోనుంచే మరో ఆదర్శానికి శ్రీకారం చుట్టారు. తన భర్త పూలే చితికి తానే స్వయంగా నిప్పుపెట్టి కొత్త సంప్రదాయానికి తెరలేపారు. భారతదేశ చరిత్రలో భర్త చితికి భార్య నిప్పు పెట్టిన తొలి సంఘటన ఇది. ఫూలే మరణాంతరం సత్యశోధక సమాజ భాధ్యతని స్వీకరించి నడిపించింది. 1897 లో ప్లేగు వ్యాధి, పూణే నగరాన్ని వణికించింది. నగరమంతా ఎడారిగా మారింది. జనమంతా దగ్గర్లోని అడవుల్లోకి పారిపోయారు. అయినా సావిత్రీబాయి పూలే కొడుకు యశ్వంత్ తో కల్సి వ్యాధిగ్రస్తులకు సేవ చేసారు. ప్లేగు వ్యాధి బారినపడిన పిల్లల కోసం వైద్య శిబిరాలు నిర్వహించింది.

ప్లేగు వ్యాధి సోకిన మాంగ్ లాంటి దళిత కులాలకి చెందిన దళిత చిన్నపిల్లలని తన చంకన వేసుకొని చికిత్స చేసి కాపాడింది. చివరికి ఆ ప్లేగు వ్యాధే ఆమెకి సోకి మార్చి 10, 1897 లో మరణించింది. ఆమె దత్తపుత్రుడు యశ్వంత్ అంత్యక్రియలు జరిపించారు. క్రాంతి బాయిగా ప్రజలందరూ పిలుచుకునే సావిత్రీబాయి పూలే ఆధునిక భారతదేశ చరిత్రలో ధృవతారగా వెలుగొందుతూనే ఉంటుంది. సావిత్రి బాయి జయంతిని నేడు భారతదేశ మహిళా ఉపాధ్యాయుల దినోత్సవంగా జరుపుకుంటున్నాము.

**– వాసిలి సురేష్**
**9494615360**

నరసరావుపేట పట్టణ పరిధిలో ఒకే చోట 6,016 మంది లబ్ధిదారులకు

# 100 ఎకరాలలో ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ

అభివృద్ధి పనులు,బహిరంగ సభకు భారీ ఏర్పాట్లు

అభివృద్ధి పనులను పరిశీలించిన శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

సచివాలయం వద్ద ప్రత్యేక బస్సులు ఏర్పాటు.

వినుకొండ రోడ్డు శ్రీ ఆంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి లబ్ధిదారులతో కలిసి భారీ ర్యాలీ



**నరసరావుపేట. ప్రజాపాలన :** వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదల గృహ నిర్మాణాలకు సంబంధించిన ఇళ్ల స్థలాల పట్టాలను శనివారం పంపిణీ చేయనున్నట్లు శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. నరసరావుపేటలోని వినుకొండ రహదారిలో వంద ఎకరాల్లో ఆరు వేల పదహారు మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ దృష్ట్యా శనివారం అభివృద్ధి పనులను సభ ఏర్పాట్లను స్వయంగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి పేదలందరికీ సొంత ఇంటి కలను నిజం చేయాలని సంకల్పంతో రాష్ట్ర వ్యాప్తంగా 30.75 లక్షల మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేసే కార్యక్రమాలు డిసెంబర్ 25వ తేదీ నుంచి ప్రారంభించిన విషయం విధితమే. అందులో భాగంగా నరసరావుపేట పురపాలక సంఘ పరిధిలోని అర్హులైన లబ్ధిదారులకు శనివారం గుంటూరు జిల్లా ఇన్చార్జ్ మంత్రి రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథ రాజు ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమం శనివారం ఉదయం 10 గంటలకు ప్రారంభం కానుంది.







**10 గృహాలకు శంకుస్థాపన**

రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి చెరుకువాడ రంగనాథరాజు ఆదివారం 10 గృహాలకు సంబంధించి శంకుస్థాపన చేయనున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పలు ప్రాంతాల్లో మోడల్ గృహాలను నిర్మించింది. అందుకు అనుగుణంగా నరసరావుపేట లోని వంద ఎకరాల్లో కూడా ఇచ్చే ప్రక్రియ లాంఛనంగా శనివారం నుంచి ప్రారంభం కానుంది.

**100 ఎకరాల సేకరణ**

నరసరావుపేట పట్టణానికి సంబంధించిన అర్హులైన 8,619 మంది లబ్ధిదారులకు గాను 6,016 మందికి ఉప్పలపాడు గ్రామానికి సమీపంలో ఇళ్ల స్థలాల పట్టాల కేటాయింపు నిమిత్తం 100 ఎకరాలు సేకరించటం జరిగిందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి చెప్పారు. వంద ఎకరాల్లో ప్లాట్ల కేటాయింపు కూడా చేయడం జరిగిందన్నారు. రహదారులను ఏర్పాటు చేస్తున్నారని, పూర్తిస్థాయిలో అభివృద్ధి పనులు జరుగుతాయన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం స్థలాల కేటాయింపు ప్రాంతంలో అన్ని అభివృద్ధి పనులు త్వరలోనే పూర్తి చేస్తామని చెప్పారు.

**ప్రత్యేక బస్సులు ఏర్పాటు**

నరసరావుపేటలోని 34 వార్డు లో లబ్ధిదారులుగా ఎంపికైన ప్రతి ఒక్కరు ఆయా వార్డుల్లో సచివాలయాల వద్ద ఏర్పాటుచేసిన ప్రత్యేక బస్సుల ద్వారా స్థానిక వినుకొండ రహదారి లో గల శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం వద్దకు శనివారం ఉదయం పదిగంటలకు చేరుకోవాలని ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి కోరారు. లబ్ధిదారుల కోసం సభాస్థలి వద్ద సచివాలయ సిబ్బంది ప్రత్యేక కౌంటర్ల ద్వారా ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేస్తారన్నారు. అందువల్ల లబ్ధిదారులు తప్పనిసరిగా ప్రత్యేక బస్సుల ద్వారా శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం వద్దకు చేరుకోవాలని విజ్ఞప్తి చేశారు. అక్కడినుంచి సభాస్థలికి ప్రదర్శనగా చేరుకోవడం జరుగుతుందని చెప్పారు.

**ఆందోళన చెందవద్దు**

అర్హులైన లబ్ధిదారుల వద్ద నుండి దరఖాస్తులు స్వీకరించి అధికారులతో పరిశీలన అనంతరం రెండో విడతలో కేటాయించడం జరుగుతుందని అందువలన ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రస్తుతం కొంత మంది లబ్ధిదారులు గృహం కోసం దరఖాస్తు చేసుకునేందుకు స్వయంగా తనను స్వయంగా కలవడం జరిగిందని అయితే వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి స్థలం అందిస్తామని ఇది నిరంతర ప్రక్రియ అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు , సత్తెనపల్లి శాసనసభ్యులు అంబటి రాంబాబు ,ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ , గుంటూరు జిల్లా కలెక్టర్ శామ్యూల్ ఆనంద్ కుమార్, అధికారులు సిబ్బంది తదితరులు ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొననున్న దృష్ట్యా లబ్ధిదారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కోరారు.

# పేదల ఆత్మగౌరవాన్ని కాపాడుతున్నాం: విడదల రజిని



**చిలకలూరిపేట, జనవరి 2 (ప్రజాపాలన) :** యడవల్లి, పోతవరం, మద్దిరాల, గోవిందపురం కమ్మవారిపాలెం గ్రామాల లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ సొంతిళ్లు అనే చిరకాల స్వప్నం జగనన్నతో ప్రతి పేద కుటుంబానికి సాకారమవుతోందని శాసనసభ్యురాలు విడదల రజిని తెలిపారు. నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు.. పథకంలో భాగంగ చిలకలూరిపేట రూరల్ మండలం యడవల్లి, పోతవరం, మద్దిరాల, గోవిందపురం కమ్మవారిపాలెం గ్రామాల లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యడవల్లి, కమ్మవారిపాలెం గ్రామాల్లో సభలు ఏర్పాటుచేశారు. ఆయా కార్యక్రమాలకు ఎమ్మెల్యే విడదల రజిని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏ ఇంటికైనా వాకిలికి వేసిన తోరణం ఆ ఇల్లు మన సొంతదైనప్పుడు మాత్రమే అందంగా కనిపిస్తుందని తెలిపారు. గుమ్మం వద్ద నిలుచునే ఇల్లాలి మోములో నిజమైన సంతోషం ఆ ఇల్లు మనం కట్టుకున్నదైనప్పుడే ఉంటుందని చెప్పారు. అందుకే ఏ ప్రభుత్వమూ కూడా ఎప్పుడూ కూడా చేయని ఆలోచనను, ఏ నాయకుడు కూడా ఎప్పుడూ చేయని సాహసాన్ని తమ ప్రభుత్వం, తమ నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసి చూపారని పేర్కన్నారు. ఒకటి కాదు, రెండు కాదు.. ఏకంగా 30,68,281 ఇళ్లను నిర్మించి నిరుపేదలకు ఇవ్వబోతున్నామని, ఇది ఒక చరిత్ర అని, ఒక సాహసం అని వెల్లడించారు. ఇంటితో ఎక్కువ అనుబంధం ఆ ఇంటిలోని ఆడబిడ్డలకే ఉంటుందని, అందుకే తమ ప్రభుత్వం ఇంటిస్థలం, ఆ స్థలంలో కడుతున్న ఇంటి హక్కులు మహిళలకే దక్కేలా చేస్తున్నామని ఎమ్మెల్యే విడదల రజిని తెలిపారు. యడవల్లిలో రూ.15.6లక్షలు ఖర్చు చేసి 65 సెంట్ల స్థలాన్ని సేకరించి 26 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశామని చెప్పారు. పోతవరం గ్రామంలో 38, మద్దిరాల 19, గోవిందపురం 103, కమ్మవారిపాలెం 56 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఆయా గ్రామాల్లో భూ సేకరణ కోసం మొత్తం రూ.50 లక్షల నిధులు వెచ్చించామని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ సుజాత,ఎంపీడీఓ హేమలత,హౌసింగ్ డీఈఈ వెంకట్రావు,చిలకలూరిపేట మండల జడ్పీటీసీ అభ్యర్థి కోడె సుధారాణి, ఎడవల్లి గ్రామ నాయకులు కొమిరిశెట్టి శ్రీనివాసరావు,ఆలా పెద్ద శేషయ్య,భలే ఏడుకొండలు,అనుగు ఏడుకొండలు, మహంకాళి సుబ్బారావు, మహంకాళి వెంకయ్య,వేల్పుల సాంబయ్య,వేల్పుల బుజ్జి,పోతవరం బాషా మేస్త్రీ,ముత్యాల రామారావు,నలమల సుబ్బారావు, కిలారు రవీంద్ర,మాలెంపాటి నరసింహారావు,గుత్తా యామలయ్య,ఆకుల రవి,కక్కెర శ్రీను మరియు పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు

# పొన్నూరు నియోజకవర్గానికి యాజమాన్య బాధ్యతలు తీసుకున్న గురజాల రమా శ్రీనివాస్‌కు సన్మానం





**పొన్నూరు, ప్రజాపాలన:** అంబేద్కర్ మాస్టర్ కీ టి వి చానల్ ఆధ్వర్యంలో ఈ రోజు పొన్నూరు పట్టణంలో మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి పొన్నూరు స్నేహ క్లబ్ గవర్నర్ కె రాంబాబు అధ్యక్షత వహించిగా, మొదట అంబేద్కర్ చిత్ర పటాన్ని పూల మాలతో అలంకరించి నివాళి అర్పించి కార్యక్రమాన్ని ప్రారం భించారు. తదుపరి పొన్నూరు నియోజకవర్గానికి ఓనర్ షిప్ బాధ్యతలు తీసుకున్న గురజాల రమా శ్రీనివాస్ కు స్నేహ గ్రూప్ అధిపతి కటికల శివ భాగ్యారావు ఐఆర్ఎస్ (విఆర్ ఎస్), అంబేద్కర్ మాస్టర్ టి వి ఎం డి కటికల క్రాంతి కుమార్ మరియు విచ్చేసిన సభ్యులు, అతిధులు సన్మానించి ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి కేక్ కట్ చేసి అభినందనలు తేలియజేశారు. ఈ కార్యక్రమంలో గాయకులు శ్రీనివాస్ దేవరాజ్ బృందం స్నేహ గ్రూపు అధిపతి శివ భాగ్యరావు పై గేయాన్ని ఆలపించి విచ్చేసిన ప్రతి ఒక్కరికి మన్నలు పొందారు. ఈ కార్యక్రమంలో వక్తలు అంబేద్కర్ మాస్టర్ కీ టి వి ప్రాముఖ్యతను వివరించారు. ముఖ్య అతిథి స్నేహ గ్రూప్ అధిపతి కటికల శివ భాగ్యారావు ఐ ఆర్ ఎస్ (విఆర్ఎస్) మాస్టర్ కీ అంబేద్కర్ టీవి గురించిన వివరాలు విపులంగా వివరించడం జరిగింది. గుంటూరు జిల్లా బాపట్ల, పొన్నూరు, రేపల్లె, తెనాలి, కృష్ణాజిల్లా నందిగామ నియోజకవర్గ యజమానులు గురజాల శ్రీనివాసరావు,గురజాల రమాదేవి,వర ప్రసాద్,శ్రీధర్,జెస్సీ దేవి, మచిలీపట్నం పార్లమెంట్ ఇన్చార్జ్ కమలాకర రావు, సైకాలజిస్ట్ ప్రత్యుష సుబ్బారావు, ఎం ఇ ఒ శోభా చంద్,తాజా మాజీ కౌన్సిలర్ కుమారీ,స్నేహ గ్రూప్ సీనియర్ సభ్యులు, డైరెక్టర్ వేల్పుల విశ్వనాధం మొదలైన వారు అతిథులుగా పాల్గొన్నారు ఈ కార్యక్రమాన్ని విజయవంతం గావించారు

# అంగన్వాడీ టీచర్స్‌కు శిక్షణా తరగతులు



**రేపల్లె, జనవరి 2 (ప్రజాపాలన) :** జనవరి 4 నుంచి 9 వరకు చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్, డి.గీతాంజలి. రేపల్లె పట్టణం లోని సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం ఆఫీసులో, 188 అంగన్వాడీ కేంద్రాల్లో ఉన్న టీచర్స్‌కు జనవరి 4 నుంచి 9 వరకు ప్రీస్కూల్ శిక్షణా తరగతులు నిర్వహించబడును అని చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్ డి గీతాంజలి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్తగా ప్రీ ప్రైమరీ స్కూల్ లలో విద్యా విధానం గురించి, పిల్లల ఆరోగ్యం ఆహారం చదువుల పై ప్రత్యేక దృష్టి పెట్టేందుకు ట్రైనింగ్ క్లాసులు నిర్వహించినట్లు ఆమె తెలిపారు. అంగన్వాడీ టీచర్స్ కు సులభమైన బోధనా విధానాలపై శిక్షణ ఇస్తున్నట్లు ఆమె తెలిపారు. గ్రామ కమిటీ లో అంగన్వాడీ టీచర్, ఆయా, గ్రామ కార్యదర్శి, ఆశా వర్కర్, స్థానిక పోలీస్ భాగస్వామ్యం చేసి ప్రభుత్వం ద్వారా ఇస్తున్న ప్రతి వస్తువును సరైన పద్ధతిలో సరైన సమయంలో లబ్దిదారునికి చేరే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఆమె తెలిపారు. అలాగే పిల్లల బరువు గురించి, గర్భిణీ స్త్రీలను ప్రతినెల పరీక్షలు చేయాలని, శారీరక మానసిక అభివృద్ధి పెంపొందించాలని, గర్భవతులు, బాలింతలలో రక్తహీనతను నివారించాలి అన్నారు. మూడు సంవత్సరాల నుండి ఆరు సంవత్సరాలు ప్రీ స్కూల్ పిల్లలకు మధ్యాహ్న భోజనం మరియు వారానికి నాలుగు కోడిగుడ్లు సక్రమంగా అందించాలని, లేనిపక్షంలో తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆమె హెచ్చరించారు. సెలవులు కావలసి వస్తే ముందుగా తెలియపరచాలని టైమ్ టు టైమ్ స్కూల్లో ఉండాలన్నారు. 2020 కోవిడ్ వల్ల అనేక ఇబ్బందులకు గురి అవ్వడం వాస్తవమే అయినప్పటికీ, 2021లో అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆమె నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ పి. నాంచారమ్మ, సిహెచ్ రజిని సిహెచ్ శివ జ్యోతి ఆర్ వెంకట్ రావు అంగన్వాడీ టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

# వడ్డెర కమ్యూనిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా జిల్లా కార్యదర్శిగా గుంజి వీరాంజనేయులు

**చిలకలూరిపేట, జనవరి 2 (ప్రజాపాలన) :** పట్టణంలోని ముదిరాజ్ కళ్యాణమండపంలో వడ్డెర కమ్యూనిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జాతీయ బీ. సీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి గంజి వీరాంజనేయులు జన్మ దిన వేడుకలు ఘనంగా జరిగాయి. జన్మదిన వేడుకలను పురస్కరించుకొని, వడ్డెర కమిటీ తరఫున జిల్లా కార్యదర్శిగా నాయకులు ప్రకటించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాజకీయ పార్టీల కంటే కుల సంఘాలే మిన్న అని, రాజకీయ నాయకులు ఎన్నికల్లో వాడుకోని వదిలివేస్తారని అన్ని సమస్యల పైన పోరాటం చేసేది కుల సంఘాల నాయకులేనన్ని ధీమా వ్యక్తం చేశారు. గుంజి వీరాంజనేయులు పుట్టినరోజు నాడు వడ్డెర కమ్యూనిటీ తరఫున జిల్లా కార్యదర్శి ఇవ్వడం శుభ పరిణామమని నాయకులు కొనియాడారు. అత్యంత వెనుకబడిన జాతి వడ్డెర కులస్తులని రాజకీయంగా, సామాజికంగా ఎదిగి రిజర్వేషన్ల దిశాగా అడుగులు వేయాలని నాయకులు అన్నారు. అనంతరం వడ్డెర కమ్యూనిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుంటూరు జిల్లా కార్యదర్శి వీరాంజనేయులు కి నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు తురక రామారావు, జిల్లా వర్కింగ్ అధ్యక్షులు వేముల శివ, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ కిషోర్, నరసరావుపేట అధ్యక్షులు రవి వర్మ, కార్యదర్శి మల్లికార్జున్, చిలకలూరిపేట నియోజకవర్గ అధ్యక్షులు తన్నీరు రామారావు, ఎస్సి,ఎస్టీ,బి.సి ముస్లిం మైనార్టీ సంఘాల రాష్ట్ర అధ్యక్షులు పఠాన్ మహమ్మద్ ఖాన్, నాయి బ్రాహ్మణ సంక్షేమ సంఘం నాయకులు కొండ్రముట్ల నాగేశ్వరరావు, జన సైనిక్ దళ్ నాయకులు వంజా ముత్తయ్య, ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక నాయకులు దేవర కొండ నాగేశ్వరరావు, వడ్డెర సంఘం నాయకులు తన్నీరు వీరాంజనేయులు, గంజి బాల సుబ్రహ్మణ్యం తో పాటు ఆయా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎఐడిఆర్ఎఫ్ అధ్యక్షులు కందుల అనందరావు మృతి అట్టడుగు వర్గాల ప్రజలకు తీరని లోటు




**కారుమంచి, జనవరి 2 (ప్రజాపాలన) :** ఆలిండియా దళిత హక్కుల వేదిక జాతీయ అధ్యక్షులు, అణగారిన కులాల గొంతుక కారుమంచి పోరు బిడ్డ కందుల ఆనందరావు అంతిమయాత్ర కారుమంచి గ్రామం లో ఈనెల 2వ తేదీన జరిగింది. తెలుగు రాష్ట్రాల నుండి వందలాది దళిత నేతలు, సామాజిక వేత్తలు అంతిమయాత్రలో పాల్గొ న్నారు. కారుమంచి లో జన్మించిన కందుల ఆనందరావు జాతీయ దళిత ఉద్యమ నేతగా ఎదగడం, నిస్వార్థంగా కృషి చేయ డం గర్వకారణమన్నారు. ఈ కార్య క్రమం లో పాల్గొన్న బహుజన ఉద్యమకారులు మాట్లాడుతూ కందుల ఆనందరావు జ్ఞాపకార్థం కారుమంచిలో ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. కందుల ఆనందరావు వామపక్ష ఉద్యమాలతో ప్రారంభమై అంబేద్కర్ వాదిగా, బుద్దిస్ట్ గా మారి నిరంతరం పేదల పక్షాన పోరాడిన యోధునిగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు,మాఊరి అభివృద్ధి కమిటీ నేత బత్తుల కృష్ణ, బహుజన నేత కొరివి వినయ్ కుమార్,చిట్టి పాటి వెంకటేశ్వర్లు( సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ) రాష్ట్ర నాయకులు, నాదెండ్ల బ్రహ్మయ్య( సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ) గుంటూరు జిల్లా కార్యదర్శి, సి.ఎస్.సాగర్ ( సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ) నెల్లూరు జిల్లా కార్యదర్శి, రఘు రామ్ కుల వివక్ష పోరాట కమిటీ జిల్లా నాయకులు, కరవది సుబ్బారావు దళిత హక్కుల పోరాట సమితి, రాజశేఖర్ పిడియస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షులు, సురేష్ ప్రగతిశీల న్యాయవాదుల వేదిక, గొల్ల అరుణ కుమార్,ఏ ఐ డి ఆర్ ఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మనిసింగ్, రాష్ట్ర కార్యదర్శి జే తాళ సుదర్శనం, నూకతోటి బాబురావు దళిత మహాసభ, విద్యాసాగర్,భగత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు. మరియు పొన్నూరులో స్నేహ గ్రూపు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్నేహ గ్రూపు సంస్థల అధిపతి కటికల శివభాగ్యరావు ఐ ఆర్ ఎస్ (విఆర్ఎస్) సభ్యుల పాల్గొన్ని కందుల ఆనందరావు మృతికి సంతాప సూచకంగా మౌనం పాటించి నివాళులు తెలియజేశారు.

# విశాఖలో విజయసాయి తప్పటడుగులా...



విశాఖపట్నం, జనవరి 2, (ప్రజా పాలన) : విశాఖ చాలా కూల్ అంటారు. అది నిజం. ఎదురుగా గంభీరమైన సాగరం ఉన్నా కూడా విశాఖ నిశ్చలంగా నిర్మలంగా ఉంటుంది. విశాఖ జనాలు తమ పనేంటో తామేంటో అన్నట్లుగా ఉంటారు. ఈ సిటీలో రాజకీయాల జోలు కానీ గోల కానీ అసలు ఉండదు. ఎన్నికల వేళ సందడి తప్ప మళ్ళీ ఎక్కడా ఎవరూ కూడా ఏదీ కనీసంగా కూడా చర్చించరు. అటువంటి విశాఖలో ఇపుడు రాజకీయాల జోరు పెరిగింది. సవాళ్ళు ప్రతిసవాళ్ళు చోటు చేసుకుంటున్నాయి. రాజకీయంగా నీవెంత అంటే నీవెంత అంటూ దూకుడు చేస్తున్నారు. ఎక్కడ విజయవాడ వంగవీటి రంగా మరెక్కడ విశాఖ సిటీ. కానీ అలా విశాఖ రాజకీయాల్లోకి ఆయన వచ్చేశారు. తెచ్చేశారు. నెల్లూరుకి చెందిన వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి విశాఖలో వైసీపీ రాజకీయాలను పరుగులు పెట్టిస్తున్నారు. దాంతో రెండవ వైపు కూడా టీడీపీ అదే విధంగా బిగ్ సౌండ్ చేయాల్సి వస్తోంది. ఈ నేపధ్యంలో విజయవాడ తరహాలో విశాఖ రాజకీయాలూ హీటెక్కి మోతెక్కిపోతున్నాయి. వంగవీటి రంగా హత్య జరిగి సరిగ్గా 32 ఏళ్ళు అయింది. కానీ రంగా హత్య కేసులో నిందితుడూ అంటూ విశాఖ తూర్పు టీడీపీ ఎమ్మెల్యే వెలగపూడిని మాత్రం వీలున్నపుడల్లా కెలకడం ప్రత్యర్ధి పార్టీలు అసలు మానడం లేదు. ఆ విధంగా ఆయననూ, ఆ వెనకాల ఉన్న టీడీపీని కూడా దెబ్బ కొట్టే వ్యూహానికి తాజాగా విజయసాయిరెడ్డి తెరతీశారు. వంగవీటి రంగా ప్రభావాన్ని ఒక ఎన్నికలో చాలా గట్టిగానే తెలుగుదేశం చూసింది. 1989 ఎన్నికల్లో ఆ పార్టీ చిత్తుగా ఓటమిపాలు కావడం వెనక కాపుల ధర్మాగ్రహం ఉందని అంతా అంటారు. ఆ తరువాత మళ్లీ కథ మామూలే. కాపులు ఎన్నో ఎన్నికల్లో టీడీపీని సపోర్ట్ చేసి మరీ ఎన్టీయార్ ని, చంద్రబాబుని కూడా ముఖ్యమంత్రులను చేశారు. ఇక కాపుల మద్దతు ఎన్నిక ఎన్నికకూ మారుతోంది. దానికి వేరే కారణాలు ఉంటున్నాయి కానీ దానికి రంగా ప్రభావం మాత్రం హేతువు కాదు, కానీ ఉన్నట్టుండి విజయసాయిరెడ్డి రంగా హత్య కేసుని ప్రస్తావిస్తూ చంద్రబాబుకు అతి ముఖ్య అనుచరుడు ఎమ్మెల్యే అయిన వెలగపూడిని టార్గెట్ చేస్తున్నారు. దీని ద్వారా టీడీపీకి మరోమారు కాపుల దెబ్బ చూపించాలన్నదే అజెండాగా కనిపిస్తోందంటే.ఏపీ రాజకీయాల్లో సామాజిక శక్తుల పాత్ర చాలానే ఉంటుంది. అది ఎవరూ కాదనలేని సత్యం. అయితే ఇపుడు కాపులు వైసీపీ వైపు ఉన్నారు. అందుకే జగన్ 151 సీట్లతో ముఖ్యమంత్రి కాగలిగారు. కానీ ఎల్లకాలం ఈ మద్దతు నిలబెట్టుకోవాలనుకుంటే మాత్రం కష్టమేనని చెప్పాలి. కాపులు అధికార పీఠం కోసం ఎదురుచూస్తున్నారు. వారి కులానికి సీఎం పీఠం ఇచ్చే పార్టీ వైపు పెద్ద ఎత్తున ర్యాలీ అవుతారు. ఇపుడు చూస్తే బీజేపీ జనసేన కూటమి కాపులను ఆకట్టుకోవాలని చూస్తున్నాయి. మరో వైపు చూసుకుంటే టీడీపీ రంగాను హత్య చేయించిందని వైసీపీ, వైసీపీలో ఉన్న కాంగ్రెస్ నాయకులే అని టీడీపీ ఆరోపణలు చేసుకోవడం ద్వారా నష్టపోయేది క్లారిటీగా ఆ రెండు పార్టీలే. ఏ రాజకీయాలను చూసి కాపులు టీడీపీ, వైసీపీల మీదనే పూర్తి విముఖత ప్రదర్శించే అవకాశాలూ ఎక్కువగా ఉన్నాయి. మూడవ పార్టీ వైపుగా కూడా మళ్ళీ సీన్ కూడా ఉంది. మరి సమయం చూసి రంగాను విశాఖ రాజకీయాల్లోకి తెస్తున్న విజయసాయిరెడ్డి కాపుల మద్దతు తమకే అని ఎలా చెప్పుకోగలుగుతారో చూడాల్సిందే.

# అళగిరి కొత్త ప్రయత్నాలు



చెన్నై, జనవరి 2, (ప్రజాపాలన) : తమిళనాడులో ఎన్నికలు దగ్గరపడే కొద్దీ రాజకీయాలు వేడెక్కుతున్నాయి. ప్రజల్లో బలం ఉందా? లేదా? ప్రభావం ఏ మేరకు చూపుతారన్నది పక్కన పెడితే ప్రధాన రాజకీయ పార్టీలకు మాత్రం చికాకు కల్గించే విధంగా సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికే రజనీకాంత్ తన పార్టీ వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తుందని ప్రకటించిన సంగతి తెలిసింది. ఆయన కూటమిని కూడా ఏర్పాటు చేస్తారంటున్నారు. దీంతో మరికొందరు కూడా కొత్త పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారు. కరుణానిధి కుమారుడు అళగిరి సయితం కొత్త పార్టీ పెట్టాలని భావిస్తున్నారు. వేరే పార్టీలో చేరడం కంటే కొత్త పార్టీ పెట్టి కనీస స్థానాలను దక్కించుకున్నా ప్రాధాన్యత ఉంటుందని అళగిరి భావిస్తున్నారు. డీఎంకే నుంచి బహిష్కరించిన అళగిరి తిరిగి ఆ పార్టీలో చేరేందుకు చేయని ప్రయత్నాలు లేవు. అయితే అళగిరి చేరికను స్టాలిన్ కుటుంబ సభ్యులు అంగీకరించలేదు. దీంతో అళగిరి కొంతకాలంగా మౌనంగా ఉంటూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో అళగిరి కొత్త పార్టీ పెడతారని చెబుతున్నారు. తొలుత అళగిరి బీజేపీలో చేరుతారని భావించారు. బీజేపీ పెద్దలు కూడా ఆయనతో సమాలోచనలు జరిపారు. అయితే బీజేపీతో కలిస్తే తన తండ్రి ఆశయాలను నీరుగార్చినట్లవుతుందని భావించిన అళగిరి ఆ ప్రయత్నం మానుకున్నారు. చెన్నై కి వచ్చిన అమిత్ షాను కూడా అళగిరి కలవలేదు. దీంతో జనవరి 3వ తేదీన తన అనుచరులతో సమావేశమై కొత్త పార్టీపై ప్రకటన చేస్తారని తెలుస్తోంది. అయితే అళగిరి ఇప్పటికే డిసైడ్ అయ్యారు. రజనీకాంత్ తో కలసి అళగిరి ఈ ఎన్నికల బరిలోకి దిగనున్నారు. రజనీకాంత్ పార్టీ తో కలసి పోటీ చేస్తే ప్రయోజనం ఉంటుందని ఆయన భావిస్తున్నారు. కొత్త పార్టీ కావడం, డీఎంకే, అన్నాడీఎంకేలకు ప్రత్యామ్నాయం రజనీకాంత్ పార్టీయే కావడం అనుకూలిస్తుందని అళగిరి అంచనా వేస్తున్నారు. రజనీకాంత్ పార్టీ అధికారంలోకి వస్తే తాను కీలక భూమిక పోషించ వచ్చని కూడా ఆయన యోచిస్తున్నారు. అందుకే అళగిరి రజనీకాంత్ పార్టీతో కలసి పోటీ చేయాలని నిర్ణయానికి వచ్చినట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు

# చిన్నమ్మ... పెద్దమ్మగా మారుతోందా

విజయవాడ, జనవరి 2, (ప్రజా పాలన) : ఏపీ బీజేపీలో రాజకీయం కొత్త మలుపులు తిరుగుతోంది. నిన్నటి దాకా తెరమీద కనిపించిన నాయకులు ఇపుడు పూర్తిగా సైడ్ అయ్యారు. బీజేపీ కీలక నేతలుగా చలామణీ అయిన వారణాశి రాం మాధవ్ ఇపుడు ఎక్కడ ఉన్నారో తెలియదు, జీవీఎల్ నరసింహారావు తరచుగా మీడియాతో మాట్లాడుతున్నా కూడా మునుపటి ధాటి జోరు ఆయనలో అసలు లేదు. ఇక సోము వీర్రాజు ఏపీ బీజేపీ ప్రెసిడెంట్ అయ్యాక కొందరు నేతలు గమ్మున్నారు. ఇపుడిపుడే వారు నెమ్మదిగా కదులుతున్నారు. ఆరు నెలల సోము అధ్యక్ష పాలన చూసిన తరువాత అధినాయకత్వం వైపు నుంచి స్పందన గమనించాక కొత్త ఆలోచనలతో పాత నాయకులు కొందరు అడుగులు వేస్తున్నారు. కాంగ్రెస్ లో ఉన్నపుడు కూడా నం దమూరి వారి ఆడపడుచు అంటూ దగ్గుబాటి పురందేశ్వరికి బాగానే మర్యాదలు దక్కాయి. ఆమెని ఏకంగా కేంద్ర మంత్రిని చేశారు. ఇక బీజేపీలో మొదట అయిదేళ్ళలో జాతీయ మహిళా మోర్చాలో ముఖ్య బాధ్యతలు అప్పగించిన బీజేపీ పెద్దలు ఇపుడు ఏకంగా బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిని చేశారు. దాంతో బీజేపీలోని ఒక సామాజికవర్గంలో పెద్ద ఎత్తున హుషార్ కనిపిస్తోంది. చిన్నమ్మతో నిన్నటి దాకా అంటీ ముట్టని వారు కూడా బీజేపీలో మరో సామాజిక వర్గానికి కాపు కాసే పరిస్థితులను చూసి తట్టుకోలేకపోతున్నారు అని అంటున్నారు. అందుకే ఈ వైపుగా జరుగుతున్నా రని కూడా విశ్లేషణలు ఉన్నాయి. విశాఖలో తాజాగా పురందేశ్వరి పర్యటన చేస్తే ఒక అనూహ్య సంఘటన జరిగింది. బీజేపీలో సీనియర్ నేత, మాజీ ఎంపీ అయిన



కంభంపాటి హరిబాబు ఆమెకు ఏకంగా విమానాశ్రయంలో స్వాగతం పలకడం విశేషం. ఏపీ బీజేపీ ప్రెసిడెంట్ గా సుదీర్ఘ కాలం పని చేసిన హరిబాబు గత కొంతకాలంగా మౌనమే నా భాష అంటున్నారు. పూర్వాశ్రమంలో వెంకయ్య నాయుడు శిష్యుడిగా ఉన్న హరిబాబు ఆలోచనలు కూడా చాలా లోతుగా ఉంటాయని అంటారు. ఆయనకు బీజేపీలో ప్రాధాన్యత తగ్గిందా పెరిగిందా అన్నది పక్కన పెడితే హరిబాబు మళ్ళీ యాక్టివ్ కావడం పురందేశ్వరికి నేరుగా స్వాగతం పలకడం మాత్రం బీజేపీ రాజకీయాల్లో అది చర్చనీయాంశం గానే ఉంది. బీజేపీలో ఇపుడు కాపుల ఆధిపత్యం కావాలని ఒక వర్గం గట్టిగా కోరుకుంటోంది. అదే సమయంలో దశాబ్దాలుగా కమ్మలు బీజేపీలో రాజకీయంగా ఉన్నత స్థానాలు అందుకున్నారు. ఒక విధంగా వారు శాసించారు. అటువంటి బలమైన సామాజికవర్గం ఇపుడు మళ్ళీ పార్టీలో పై చేయి సాధించడానికి చూస్తోందా అన్న అనుమానాలు అయితే కలుగుతున్నాయి. సోము వీర్రాజు ఏకపక్ష నిర్ణయాలు, ఆయన ఫైర్ బ్రాండ్ తత్వం, ఆఖరుకు మిత్ర పక్షం జనసేనతో సైతం సరిగ్గా హ్యాండిల్ చేయలేకపోతున్న తీరు ఇవన్నీ కూడా హై కమాండ్ దృష్టిలో ఉన్నాయని అంటున్నారు. దానికి తోడు బీజేపీలో పురందేశ్వరి పాత్ర కూడా పెరగడంతో ఆమెను అల్లుకుని కాషాయం పార్టీలో సరికొత్త రాజకీయానికి బలమైన ఒక వర్గం ప్రయత్నాలు మొదలుపెట్టిందని అంటున్నారు. మరి చూడాలి ఈ పరిణామాలు ఏ వైపునకు దారి తీస్తాయో.

# టార్గెట్ జేడీయూ



పాట్నా, జనవరి 2, (ప్రజాపాలన) : అనుకున్నట్లుగానే జరుగుగుతుంది. క్రమంగా నితీష్ కుమార్ ను బీజేపీ టార్గెట్ చేస్తుంది. బీహార్ విషయంలో ఇంకా స్పీడ్ పెంచక పోయినా ఇతర రాష్ట్రాల్లో జేడీయూను బలహీన పర్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తుంది. జేడీయూ ను క్రమంగా వీక్ చేసి బీహార్ లోనూ ముఖ్యమంత్రి పదవిని బీజేపీ అధిష్టించడమే లక్ష్యంగా బీజేపీ పెట్టుకున్నట్లే కన్పిస్తుంది. అయితే దీనికి బీజేపీ కొంత సమయం తీసుకునే అవకాశం కన్పిస్తుంది.బీహార్ లో ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించింది. జేడీయూకు తక్కువ స్థానాలు ఇచ్చినా ముందుగా ఇచ్చిన మాట ప్రకారం జేడీయూ అధినేత నితీష్ కుమార్ ను ముఖ్యమంత్రిని చేసింది. మంత్రి పదవుల విషయంలో మాత్రం బీజేపీదే పైచేయి అయింది. ఒకరకంగా ముఖ్యమంత్రిగా నితీష్ కుమార్ ఉన్నప్పటికీ నిర్ణయాలన్నీ అమలు చేసేది బీజేపీయేనన్నది వాస్తవం. ఈ పరిస్థితుల్లో నితీష్ కుమార్ కు కొంత సమయం ఇచ్చి తర్వాత ఆయనను కేంద్ర ప్రభుత్వంలోకి తీసుకోవాలన్నది బీజేపీ యోచనగా కన్పిస్తుంది. తాజాగా అరుణాచల్ ప్రదేశ్ సంఘటన చూస్తే అదే నిజమనిపిస్తుంది. బీజేపీకి జేడీయూ మిత్రపక్షం. జేడీయూ కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామి కాకపోయినా ఆ పార్టీ అన్ని అంశాల్లో బీజేపీకి మద్దతుగా నిలుస్తుంది. బీహార్ లో రెండు పార్టీలు కలసి అధికారంలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో అరుణా చల్ ప్రదేశ్ లో ఆరుగురు జేడీయూ ఎమ్మెల్యేలు అధికార పార్టీ బీజేపీలో చేరారు. ఉన్న ఏడుగురిలో ఆరుగురిని బీజేపీ తన పార్టీ లో చేర్చుకుని నితీష్ కుమార్కు షాక్ ఇచ్చింది.60 మంది సభ్యులగల అరుణాచల్ ప్రదేశ్లో బీజేపీకి ఇప్పటికే నలభై మందికి పైగా సభ్యులు న్నారు. మ్యాజిక్ ఫిగర్ కంటే ఎక్కువే ఉన్నారు. కానీ అక్కడ ఫిరాయింపులను ప్రోత్సహించింది. మిత్రపక్షమైన జేడీయూనే టార్గెట్ చేసింది. దీంతో అరుణాచల్ ప్రదేశ్ జేడీయూ నేతలు బీజేపీ పై ఫైర్ అవుతున్నారు. కానీ బీజేపీ మద్దతుతోనే ముఖ్యమంత్రి అయిన నితీష్ కుమార్ మాత్రం ఏం చేయలేని పరిస్థితుల్లో ఉన్నారు. అరుణాచల్ ప్రదేశ్ తర్వాత బీహార్ పైనే బీజేపీ దృష్టి పెడతారంటున్నారు. ఏ తర్వాత బీ యే కదా మరి.

# కర్నాటకలో స్కూళ్లు ప్రారంభం

బెంగళూరు జనవరి 2, (ప్రజాపాలన) : కరోనా వ్యాప్తి వల్ల గతేడాది మార్చిలో మూతపడిన పాఠశాలలు కేరళ, కర్నాటక సహా పలు రాష్ట్రాల్లో పాక్షికంగా తెరుచుకున్నాయి. కర్నాటక రాష్ట్రంలో విద్యార్థుల మధ్య రెండు మీటర్ల దూరం పాటిస్తూ తరగతులు ప్రారంభమయ్యాయి. షిఫ్టులవారీగా పరిమిత గంటల్లో తరగతులను నిర్వహిస్తున్నారు. కోవిడ్ నిబంధనలను కఠినంగా పాటిస్తూ తరగతులను నిర్వహించాలని ఇటీవల మార్గదర్శకాలు విడుదల చేసింది రాష్ట్ర సర్కారు. పరిమిత గంటల పాటు 10, 12 తరగ తులకు ఇవాళ క్లాసులు ప్రారంభమయ్యాయి. ఒకసారికి 50శాతం మంది విద్యార్థులను మాత్రమే అనుమతించాలని పాఠశాల యాజమాన్యాలకు కేరళ సర్కారు సూచించింది. విద్యార్థులు మాస్కులు ధరించేలా చూడాలని, శానిటైజర్లు అందుబాటులో ఉంచాలని తెలిపింది. తల్లిదండ్రుల అనుమతితో మాత్రమే విద్యార్థులను అనుమతించాలని పేర్కొంది.

# దేశవ్యాప్తంగా కోవిడ్ వ్యాక్సిన్ డ్రై రన్

న్యూఢిల్లీ జనవరి 2, (ప్రజాపాలన) : దేశవ్యాప్తంగా కరోనా వ్యాక్సిన్ పంపిణీకి ముందస్తు సన్నాహకంగా కేంద్ర ప్రభుత్వం శనివారంనాడు అన్ని రాష్ట్రాల్లో, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 'డ్రై రన్' నిర్వహించింది. 'డ్రై రన్' సన్నద్ధతపై ఢిల్లీ ప్రభుత్వాధికారులతో కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ హర్షవర్ధన్ శుక్రవారం సమీక్షా సమావేశం జరిపిన విషయం తెలిసిందే. వ్యాక్సిన్ రిహార్సల్స్ జరుగుతున్న 'డ్రై రన్'ను అసోం, ఆంధ్రప్రదేశ్, పంజాబ్, గుజరాత్లలో గత డిసెంబర్ 28, 29 తేదీల్లో నిర్వహించారు. తక్కిన రాష్ట్రాల్లో శనివారం ఈ డ్రై రన్ నిర్వహించారు. హెల్త్ వర్కర్ల జాబితాను సిద్ధం చేసి కోవిడ్ ప్లాట్ఫాంపై అప్లోడ్ చేస్తామని, ఎన్నికల సమయంలో ఏ విధంగా సన్నాహాలు చేస్తామో, అదే పద్ధతిలో అన్ని వైద్య బృందాలకు బాధ్యతాయుతంగా శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని హర్షవర్ధన్ చెప్పారు. జాతీయ స్థాయిల్లో 2,000 మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఇస్తామన్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో 700కు పైగా జిల్లాల్లో శిక్షణ ఉంటుందని చెప్పారు. ఎన్నికల సమయంలో బూత్ స్థాయిలో శిక్షణ ఏవిధంగా ఉంటుందో అదో విధంగా ఈ శిక్షణ కూడా ఉంటుందన్నారు.

# మచిలీపట్నంలో డ్రై రన్

మచిలీపట్నం జనవరి 2, (ప్రజాపాలన) : కృష్ణాజిల్లా కేంద్రమైన మచిలీపట్నం లో మూడు ప్రాంతాలలో వ్యాక్సిన్ డ్రై రన్ ప్రారంభమయింది. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో డ్రై రన్ లో డిఎంహెచ్ ఓ సుహాసిని, ఆర్డీవో ఖాజావలి పాల్గొన్నారు. వ్యాక్సిన్ ను అందించడంలో సాంకేతిక లోపాలను సరిచేసి చేసుకోవడం కోసం రెండవసారి డ్రై రన్ నిర్వహిస్తున్నట్లు జిల్లా డిఎంహెచ్ఓ తెలిపారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ ఓ మాట్లాడుతూ.. ఈ ప్రక్రియలో ముందుగా నమోదు కాబడిన పేర్లను మహిళ కానిస్టేబుల్, సచివాలయ సిబ్బంది తనిఖీ చేసి,డిజిటల్ సిబ్బంది వద్దకు వెళ్లిన తదుపరి పేరును పరిశీలించి, వ్యాక్సిను అందించే ప్రదేశానికి పంపిస్తారని డిఎంహెచ్ ఓ తెలిపారు. వ్యాక్సిన్ వేసిన తర్వాత 30 నిమిషాల పాటుగా వైటింగ్ రూమ్ లో అబ్జర్వేషన్ లో ఉంచి తర్వాత పంపిస్తామని ఒకవేళ ఏదైన రియాక్షన్ ఇస్తే మోతాదును బట్టి తిరిగి వైద్యం అందిస్తామని తెలిపారు. అనంతరం వ్యాక్సిన్ కు ఉపయోగించిన నీడిల్స్ ను నిర్వీర్యం చేస్తామని తెలిపారు. మచిలీపట్నం ఆర్డీవో మాట్లాడుతూ ప్రపంచంలో ఉన్న వ్యాక్సిన్ లో అత్యుత్తమ వ్యాక్సిన్ ను ప్రజల క్షేమం కోసం ప్రభుత్వం కొనుగోలు చేసి ముందుగా ఎన్నిక కాబడిన వారియర్స్ కు ఈ వ్యాక్సిన్ అందిస్తున్నట్లు తెలిపారు. వ్యాక్సిన్ వేసే ప్రక్రియను ఈ రోజు డిఎంహెచ్ఓ అధికారిణి తో కలిసి పరిశీలించానని తెలిపారు

# జేసీ దివాకర్ దీక్ష

అనంతపురం జనవరి 2, (ప్రజా పాలన) : అట్రాసిటీ కేసులు పరిష్కరించే వరకు... ఈ నెల 4 నుంచి తాడిపత్రిలో అమరణ దీక్ష చేస్తానని మాజీ ఎంపీ జేసీ దివాకర్ రెడ్డి ప్రకటించారు. అట్రాసిటీ కేసును రాజకీయంగా వాడుకుంటున్నారని తప్పుబట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నవారిపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. సీఐని కులంపేరుతో దూషించినట్టు తనపై తప్పుడు కేసు పెట్టారని తెలిపారు. తమ ఇంట్లోనే కులాంతర వివాహాలు చేసుకున్నామని పేర్కొన్నారు. రెండేళ్ల తర్వాత ప్రభోధనంద ఆశ్రమంపై కేసును వాడుకుంటున్నారని దివాకర్ రెడ్డి దుయ్యబట్టారు. అరెస్టులు.. దాడులు ప్రతి దాడులతో తాడిపత్రి అట్టుడికి పోతోంది. అటు మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్రెడ్డి.. ఇటు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి అనుచరుల అరెస్టుల పర్వం కొనసాగుతోంది. అక్కడ సాధారణ పరిస్థితి రావడానికి



ఇంకా సమయం పట్టే అవకాశం ఉంది. ఇప్పటికే ప్రభాకర్రెడ్డిపై కేసు నమోదు అయింది. జేసీతో పాటు అనుచరులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుతోపాటు 307సెక్షన్ కింద తాడిపత్రి వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. తాడిపత్రి ఫ్యాక్షన్కు పెట్టింది పేరు. అక్కడ జేసీ, కేతిరెడ్డి కుటుంబాల మధ్య దశాబ్దాలుగా కక్షలున్నాయి.మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి వర్గీయులు బయట ఎక్కడైనా పరస్పరం తారసపడితే ఏం జరుగుతుందోనని పట్టణ ప్రజలు బెంబేలెత్తుతారు. వారిని అదుపు చేయలేక పోలీసులు ఆందోళన చెందుతారు. జేసీ, కేతిరెడ్డి కుటుంబాల మధ్య పోరు దశాబ్దాలుగా సాగుతోంది. గత ఎన్నికల్లో పెద్దారెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందటంతో ఆ రెండు వర్గాల రాజకీయ ప్రత్యర్థులుగా మారాయి. దీంతో కేతిరెడ్డి పెద్దారెడ్డి, జేసీ ప్రభాకర్రెడ్డి ఒకరిపై ఒకరు విమర్శలు, ఆరోపణలతో నిప్పులు చెరుగుతున్నారు. సందర్భమేదైనా.. సరే ఈ నేతలిద్దరూ ఒకరికొకరు తారసపడ్డారంటే అక్కడ యుద్ధ వాతావరణమే ఏర్పడుతోందనటంలో సందేహం లేదు.

# రజాకారుల పాలన బాగుంది

భువనగిరి జనవరి 2, (ప్రజాపాలన) : జనగామ జిల్లా అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి అరెస్టును రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నది. కేసీఆర్ కు పోయే రోజులు దగ్గర పడ్డాయని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. సోయిలేని మాటలను మాట్లాడుతున్న కేసీఆర్. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపైన అక్రమ కేసులు పెట్టిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్, పరిపాలన రజాకరుల పాలన కంటే ఘోరంగా వుందని అన్నారు. కేసీఆర్ పాలన కంటే రజాకారుల పాలన భేష్ గా వుంది. వచ్చే రెండు ఏండ్ల కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు.

# రంగంలోకి వైసీపీ వారసులు...



**విజయవాడ, జనవరి 2, (ప్రజాపాలన) :** వైసీపీలోనూ వారసత్వ రాజకీయాలు ఊపందుకున్నాయి. వచ్చే ఎన్నికలకు తమ వారసులను రంగంలోకి దించేందుకు సీనియర్ నేతలు ప్రయత్నిస్తున్నారు. జగన్ యువకుడు కావడంతో ఆయన పార్టీలో సీనియర్లుగా ఇమడ లేక కొందరు, తమ వారసులకు రాజకీయ భవిష్యత్ ను అందించేందుకు మరికొందరు వారసులను రాజకీయాల్లోకి దించేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ఇందులో సీనియర్ నే?తలు ఉండటం విశేషం. వీరికి జగన్ కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారంటున్నారు.పాణ్యం నియోజకవర్గంలో కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆరుసార్లు విజయం సాధించారు. తనను పాణ్యం నియోజకవర్గం నుంచి దూరం చేసే శక్తి ఎవరికీ లేదని కాటసాని రాంభూపాల్ రెడ్డి పదే పదే చెబుతున్నారు. వచ్చే ఎన్నికల్లో ఆయన తన కుమారుడు కాటసాని శివ నరసింహారెడ్డిని బరిలోకి దించేందుకు గ్రౌండ్ ప్రిపేర్ చేసుకుంటున్నారు. ఈ మేరకు వైసీపీ హైకమాండ్ నుంచి కూడా అనుమతి లభించిందని చెబుతున్నారు.మరో సీనియర్ నేత బొత్స సత్యనారాయణ సయితం తన వారసుడిని వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్నారు. బొత్స సందీప్‌ను ఆయన రాజకీయంగా పైకి తెచ్చేందుకు పావులు కదుపుతున్నారు. వైసీపీలో ముఖ్యనేతగా సందీప్ ను మలచాలన్నది బొత్స సత్యనారాయణ వ్యూహంగా ఉంది. త్వరలోనే డాక్టర్ సందీప్ రాజకీయ అరంగేట్రం ఖాయమని చెబుతున్నారు. వైసీపీ అధినేత జగన్ సయితం బొత్స ప్రతిపాదనకు అంగీకరించినట్లు తెలిసింది.మరో సీనియర్ నేత ధర్మాన ప్రసాదరావు కుమారుడు మనోహర్ నాయుడు కూడా ఇప్పటికే రాజకీయాల్లో బిజీగా ఉన్నారు. ఆయనను కూడా వచ్చే ఎన్నికలలో వైసీపీ తరుపున బరిలోకి దించాలని ధర్మాన ప్రసాదరావు ప్రయత్నిస్తున్నారు. ఇక ఏపీ స్పీకర్ తమ్మినేని సీతారాం సయితం తన వారసుడు నాగ్ ను వచ్చే ఎన్నికల్లో పోటీ చేయించాలని నిర్ణయించారు. ఇప్పటికే నాగ్ ను వైసీపీ అధినేత జగన్ కు పరిచయం చేశారు. ఇలా వారసులను వచ్చే ఎన్నికల్లో పోటీ చేయించేందుకు సీనియర్ నేతలు అన్ని రకాలుగా సిద్ధమవుతున్నారు. గత ఎన్నికల్లో టీడీపీ సీనియర్ నేతలు వారసులను బరిలోకి దింపినా ఫలితం కన్పించలేదు. మరి వైసీపీ నేతల వారసులు వచ్చే ఎన్నికల్లో విజయం అందుకుంటారా? లేదా? చూడాల్సి ఉంది.

# కామినేని శ్రీనివాస్..కిం కర్తవ్యం



**విజయవాడ, జనవరి 2, (ప్రజాపాలన) :** ఆయన మాజీ మంత్రి. బీజేపీలో ఉన్నప్పటికీ ఆయన తెలుగుదేశం మంత్రిగానే హావాను కొనసాగించారు. ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఆశీస్సులతో ఆయన బీజేపీలో చేరిన వెంటనే మంత్రిపదవి దక్కింది. ఆయనే కామినేని శ్రీనివాస్. తెలుగుదేశం, బీజేపీ కలసి ఉన్నంత కాలం యాక్టివ్ గా ఉన్నారు. కన్నా లక్ష్మీనారాయణ బీజేపీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గానే పాల్గొన్నారు. కానీ గత కొంతకాలం నుంచి ఆయన అన్నింటికి దూరంగా ఉంటూ వస్తున్నారు.ప్రధానంగా సోము వీర్రాజు రాష్ట్ర అధ్యక్షుడు అయిన నాటి నుంచి కామినేని శ్రీనివాస్ జాడ కన్పించడం లేదు. నిమ్మగడ్డ రమేష్ కుమార్‌ను పదవి నుంచి తప్పించిన అంశంలో కామినేని శ్రీనివాస్ హైకోర్టును ఆశ్రయించారు. బీజేపీ అధినాయకత్వం ఆమోదంతోనే తాను హైకోర్టులో పిటీషన్ వేశారని కామినేని శ్రీనివాస్ చెప్పారు. తర్వాత హైదరాబాద్ లో ఒక హోటల్‌లో నిమ్మగడ్డ రమేష్ కుమార్‌ను కలిసిన విషయంలో కూడా కామినేని శ్రీనివాస్ వార్తల్లో వ్యక్తి అయ్యారు.కానీ అప్పటి నంచి కామినేని శ్రీనివాస్ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఆయన ఎక్కువగా హైదరాబాద్ కే పరిమితమయ్యారంటున్నారు. గతంలో కన్నా లక్ష్మీనారాయణ పార్టీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు అప్పుడప్పుడు పార్టీ కార్యక్రమాల్లో కన్పించేవారు. కానీ సోము వీర్రాజు అధ్యక్షుడయిన నాటి నుంచి టీడీపీ అనుకూల నేతలకు ఆయన ప్రాధాన్యత ఇవ్వడం లేదు. పైగా సుజనా చౌదరి వంటి నేతలనే పక్కన పెట్టారు.దీంతో పార్టీలో ఇమడ లేకపోతున్నామని కామినేని శ్రీనివాస్ తన సన్నిహితుల వద్ద వ్యాఖ్యానించినట్లు తెలిసింది. ఇటీవల హైదరాబాద్ వచ్చిన బీజేపీ ముఖ్యనేతను కలసి కూడా ఆయన ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. అందుకే తాను దూరంగా ఉంటున్నానని, స్వేచ్ఛగా అభిప్రాయాలను కూడా తెలియజేసేందుకు పార్టీలో అవకాశం లేకుండా పోయిందని కామినేని శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేసినట్లు చెబుతున్నారు. తెలంగాణ పార్టీకి, ఏపీ పార్టీకి నాయకత్వం విషయంలో చాలా తేడాలున్నాయని కామినేని శ్రీనివాస్ పలువురి వద్ద అభిప్రాయపడినట్లు తెలిసింది.

# రైతులను దగా చేసిన జగన్మోహన్ రెడ్డి

**– సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ**

**విజయవాడ, జనవరి 2, (ప్రజాపాలన) :** పిఎం కిసాన్ పథకం మూడో విడత డబ్బును వైఎస్సార్ రైతు భరోసా నమ్మించటం తగునా అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ప్రశ్నించారు. రైతు భరోసా కింద ఇచ్చే రు.13,500 లో రు.6 వేలు కేంద్రం నుండి వచ్చేదే. రైతుల పట్ల చిత్తశుద్ధి ఉంటే కేంద్రం నిధులు తో సంబంధం లేకుండా రైతు భరోసా పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే ఇవ్వాలని అన్నారు.

# విశాఖ మౌలిక సదుపాయాలకే దూరం

**విశాఖపట్టణం, జనవరి 2, (ప్రజా పాలన) :** విశాఖ స్మార్ట్ సిటీ. మెగా సిటీ. మరిప్పుడో ఏకంగా పాలనా రాజధానిగా ప్రకటించారు. న్యాయ వివాదాలు లేకపోతే ఈపాటికి విశాఖలోనే సీఎం మకాం పెట్టి ధూం ధాం గా రోడ్ల మీద టూర్లు వేసేవారు. మరి అటువంటి విశాఖలో మౌలికమైన సదుపాయాల విషయానికి వస్తే ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నట్లుగా పరిస్థితి ఉంది. కనీస సదుపాయలు ముందు కల్పించండి మహాప్రభో అని జనాలు గోల పెడుతున్నారు. జగన్ సర్కార్ వచ్చి ఇప్పటికి ఏడాదిన్నర కాలం గడచి పోయింది. కానీ కానీ కనీసం ప్రధానమైన రోడ్లకు ప్యాచ్ వర్కులు కూడా చేయించలేదు అన్న మాట అయితే గట్టిగానే ఉంది. జీవీఎంసీ వద్ద నిధులు లేవు. రాష్ట్ర ప్రభుత్వం అసలు పట్టించుకోవడంలేదు. దాంతో విశాఖ రోడ్లు భారీ ఎత్తున పగుళ్ళతో దర్శనమిస్తున్నాయి.విశాఖ కార్పొరేషన్ ఎన్నికలు జరిగితే మాదే విజయం అని జబ్బలు చరచుకుంటున్న అధికార పార్టీ కనీసం రోడ్ల దుస్థితిని పట్టించుకోవడంలేదని నగరవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జగన్ వచ్చాక వానలు బాగా కురిసాయి. అంతటితో సంతోషం అనుకుంటే రోడ్లన్నీ వానలకు, వరదలకూ పూర్తిగా పాడైపోయి గుంటలు పడిపోయాయి. ఎటు చూసినా మెయిన్ రోడ్లే అతుకుల గతుకుల మయంగా ఉన్నాయి. దీంతో విశాఖ రోడ్ల విషయంలో ప్రభుత్వం వెంటనే శ్రద్ధ పెట్టకపోతే రానున్న జీవీఎంసీ ఎన్నికలలో వైసీపీకి అదే అతి పెద్ద మైనస్ పాయింట్ అవుతుందని అంటున్నారు. అధ్వాన్నమైన రోడ్ల అంశాన్ని బీజేపీ పొలిటికల్ అజెండాగా మార్చుకుంది. విశాఖ లో తన బలాన్ని పెంచుకునేందుకు బీజేపీ ఏకంగా రోడ్ల మీద పడింది. ఏ రోడ్డు చూసినా ఏముంది గర్వకా రణం పాలకుల ఉదాశీనతకు అదే అచ్చమైన నిదర్శనం అంటూ బీజేపీ నేతలు చేస్తున్న విమర్శలకు వేస్తున్న సెటైర్లకు వైసీపీ నుంచి కనీసం బదులు చెప్పే సీన్ కూడా లేకుండా ఉంది. మరో వైపు మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు లాంటి వారు ఇదే అంశాన్ని రాజకీయ అస్త్రంగా చేసుకుంటున్నారు. తెలుగుదేశం పార్టీ ఏలుబడిలో విశాఖ ఇంత దారుణంగా ఉందాఅంటూ టీడీపీతమ్ముళ్ళు వేస్తున్న ప్రశ్నలు జనాలకు బాగానే తాకుతున్నాయి. దాంతో వైసీపీకి ఉత్తి పుణ్యానికే భారీ వ్యతిరేకత వచ్చేలా ఉంది.కొత్త ఏడాదిలో ఎన్నికలకు వెళ్తామని చెబుతున్న వైసీపీ పెద్దలు ముందు అర్జంటుగా విశాఖ రోడ్లను అభివృద్ధి చేయాల్సిందేనని డిమాండ్ వచ్చి పడుతోంది. అది జరగకుండా వారు ఎన్నికలకు వెళ్తే మాత్రం పగిలిన రోడ్ల సాక్షిగా అది పెద్ద దెబ్బ వైసీపీకి పడడం ఖాయమని అంటు న్నారు. మరో వైపు పాలనారాజధాని అంటూ తెగ ఊదరగొట్టడం కూడా బూమరాంగ్ అవుతోంది. ఉన్న రోడ్లకే దిక్కు లేదు, ఇపుడు రాజధాని వస్తే ఏం చేస్తారూ అంటూ జనం కూడా రివర్స్ అవుతున్నారు. మరి పగిలిన రోడ్లలో తమ భవిష్యత్తును చూసుకుంటారో లేక విశాఖలో కనీస మౌలిక సదుపాయాల మీద దృష్టి సారిస్తారో అధికార పార్టీయే తేల్చుకోవాలని జనాలు అంటున్నారు.

# డబ్బులు పోయె...అద్దెలు రాకపోయె

**విజయవాడ, జనవరి 2, (ప్రజాపాలన) :** రాజధాని ఊపుగా ఉన్న సమయంలో గ్రామాల్లో భవనాల నిర్మాణం ఊపందుకుంది. అద్దెలు వస్తాయనే ఆశతో చిన్న, సన్నకారు రైతులు వారికున్న కొద్దిపాటి భూములమ్మి భవనాలు నిర్మించుకు న్నారు. రాజధాని పరిధిలో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టారని సుమారు 271 ఇళ్లకు సిఆర్‌డిఎ అధికారులు నోటీసులు కూడా ఇచ్చారు. చిన్న రైతులూ కొద్దిపాటి అపార్టుమెంటు తరహా నిర్మాణాలు చేపట్టారు. ఒక్కో ఇంటిని రూ.10 వేల నుండి రూ.15 వేల వరకూ అద్దెలకు ఇచ్చారు. మూడేళ్లపాటు అధికారులు, సిబ్బంది, కార్మికులు, కాంట్రాక్టు గుమస్తాలు ఇలా వేల సంఖ్యలో జనాభా అక్కడకు రావడంతో ఇళ్లకు తీవ్ర డిమాండు వచ్చింది. కొంతమందైతే అప్పటికప్పుడే ఇంటి ముందు ఖాళీస్థలాల్లో రేకుల షెడ్లు వేసి ఒకరిద్దరు ఉండే గదులనూ ఐదారువేల వరకూ వసూలు చేశారు. రోజువారీ అద్దెలకూ ఇచ్చారు. చిన్నపాటి పనులకు వచ్చేవారికి రెండు, మూడు రోజులకూ అద్దెలకిచ్చారు. సెక్రటేరియట్ దగ్గర్లో ఉన్న మందడం గ్రామంలో ఈ తరహా డిమాండు ఎక్కువగా ఉండేది. సెక్రటేరియట్‌కు సుదూర ప్రాంతాల నుండి వచ్చేవారు రెండు మూడు రోజులు ఉండాల్సి వస్తే ఇక్కడ గదులు తీసుకుని పని పూర్తయిన తరువాత వెళ్లిపోయేవారు. దీనికిగాను రోజుకు రూ.500 వరకూ వసూలు చేశారు. ఐనవోలులో అయితే విట్ విద్యార్థులు ఎక్కువమంది అద్దెలకు దిగారు. ఇక్కడ నలుగురు ఉండే ఇంటి అద్దె రూ.10 వేల వరకూ వెళ్లింది. పొలాలు పోయి మరో ఆదాయం లేకపోవడంతో ఎక్కువ మంది ఇంటి అద్దెలపై ఆధారపడ్డారు. ఇక్కడ రాజధాని వస్తే ఇదే డిమాండు ఉంటుందనే ఉద్దేశంతోనే నిర్మాణం చేపట్టామని జె.నవీన్ పేర్కొన్నారు. మందడంలో చిన్న రైతు కృష్ణ ఉన్న 40 సెంట్ల భూమిని అమ్మి చిన్నపాటి ఇల్లు కట్టుకున్నాడు. అద్దెలు వస్తాయనుకుంటే రాజధాని పనులు ఆగిపోవడంతో ఆయా గ్రామాల్లో ఉండేందుకు వచ్చిన వారూ తిరిగి వెళ్లిపోయారు. దీంతో అద్దెలు లేకుండా పోయాయి. సాంబశివరావు అనే వ్యక్తి వేరే ప్రాంతం నుండి ఇక్కడ టీ అమ్మేందుకు వచ్చాడు. ఆయన ఉండేందుకు నాగేశ్వరరావు అనే వ్యక్తి ఇంట్లో అద్దెకు దిగాడు. నెలకు ఆరువేల రూపాయలు చెల్లించారు. రాజధాని ఊపు ఉన్నంతకాలం వ్యాపారం బాగానే నడిచింది. ఇప్పుడు పూర్తిగా తగ్గిపోయింది. ప్రస్తుతం సాధారణ వ్యాపారం నిర్వహిస్తున్నారు. ఉన్న కొద్దిపాటి డబ్బులు ఇంటిపై పెట్టి, ఆదాయం రాక, అద్దె కట్టలేక ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి వారూ కొందరున్నారు. సాధారణంగా వచ్చిన బూమ్‌తో ఆశపడి ఇళ్లు నిర్మించిన వారికి ఖాళీ ఇల్లే దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం అన్నీ పోయాయి. పైగా నిర్మించిన భవనాలకు ప్లానులేదని, దీనిపై వివరణ ఇవ్వాలని సిఆర్‌డిఎ అధికారులు నోటీసులు ఇవ్వడం మొదలుపెట్టారు. టిడిపి ప్రభుత్వ సమయంలో ఇళ్లు నిర్మించుకుంటున్నా చూసీ చూడనట్లు ఉన్న అధికారులు ఇప్పుడు నోటీసులు జారీచేస్తున్నారు. అటు ఆదాయం రాక, ఇటు ఆఫీసు చుట్టూ తిరగలేక ఇళ్ల యజమానులు అవస్థలు పడుతున్నారు.

# తిరుపతి కోసం ఎవరి ప్రయత్నాలు..

**తిరుపతి, జనవరి 2, (ప్రజాపాలన) :** తెలంగాణలో దుబ్బాక ఎమ్మెల్యే ఎలక్షన్ కి ఎంత హీట్ వచ్చిందో.. తిరుపతి ఎంపీ సీటుకి కూడా అంతే ఇంపార్టెన్స్ రాబోతుంది. కానీ.. ఎవరు గెలుస్తారు అంటే ఇప్పుడే కష్టం. ఏమో.. ఏదైనా జరగొచ్చు. ఓ పక్క టీడీపీ సైకిల్ పరుగులు పెడుతోంది. ఎలాగైనా సరే గెలిచి తీరాలి అని పట్టుమీదుంది టీడీపీ. ఇటు బీజేపీ ఏమో.. తెలంగాణలో లాగా ప్రూవ్ చేసుకోవాలి. మరో దుబ్బాక రిజల్ట్ చూపించాలని కసి మీదుంది. ఇటు జనసేన కూడా అంతే టిక్కెట్ సంపాదించి.. పవర్ చూపించాలని చూస్తుంది. ఇన్ని పార్టీలు పట్టుమీదుంటే.. మరి అధికార పార్టీ ఎలా ఉండాలి చెప్పండి. అందుకే.. పక్కా ప్లాన్ తో వెళ్తోంది వైసీపీ. గత మెజార్టీ కంటే కాస్త ఎక్కువే తెచ్చుకోవాలని చూస్తోంది అధికార వైసీపీ.తిరుపతి సీటుపై ఫుల్లు కాన్సంట్రేట్ చేసిన వైసీపీ.. పక్కా ప్లాన్ రెడీ చేసింది. ఫిజియో థెరపిస్ట్ గురుమూర్తికి టిక్కెట్ ఇస్తారు అనే టాక్ ఉన్నా.. అధికారికంగా ఇంకా చెప్పలేదు. వచ్చే ఆరో తారీఖున సీఎం జగన్ అభ్యర్థి పేరు చెబుతారనే టాక్ ఉంది. అప్పటి నుంచి ప్రచారం ప్రారంభం అయినట్లు అవుతుంది. దీంతో.. అంతా రెడీ చేసింది వైసీపీ. నియోజక వర్గంలోని ఏడు సెగ్మెంట్లలో ప్రచారానికి ఏర్పాట్లు చేస్తోంది. తిరుపతి ఉప ఎన్నిక బాధ్యత యంగ్ లీడర్లకి ఇవ్వాలని ఆలోచిస్తుందంట వైసీపీ. నియోజక వర్గాల్లోని ఎమ్మెల్యేల వారసులకి ఇవ్వాలని చూస్తుందంట. అలా అయితే వారికి కూడా ఒక ఛాన్స్ ఇచ్చినట్లు ఉంటుంది. యంగ్ లీడర్లు జనానికి పరిచయం కూడా అయినట్లు ఉంటుంది. ముందు ముందు రోజుల్లో పార్టీకి వాళ్ల ఫేమ్ కూడా హెల్ప్ అవుతుంది అనే ప్లాన్ లో ఉందంట వైసీపీ. తిరుపతి ఎంపీ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలోనూ ఎమ్మెల్యేలు వైసీపీ లీడర్లే. సో.. యంగ్ స్టర్స్ కి ఇస్తే.. వారి పవర్ ఏంటో చూపిస్తారనేది వారి అంచనా. తిరుపతిలో విజయం తమదే అనుకుంటున్న వైసీపీ.. మెజార్టీపైనే ఎక్కువ ఫోకస్ చేసిందంట. ముఖ్యంగా యువ లీడర్లకి ప్రచార బాధ్యతలు అప్పగిస్తే పరిస్థితులు ఏంటి.. ఎమ్మెల్యేల పర్యవేక్షణ ఎంత వరకు ఉంచాలి అనే విషయాలను.. ఈ రెండు మూడు రోజుల్లో ఫైనల్ చేస్తారట.

# రజనీ కాంత్ కోసం నేతల క్యూ..

**చెన్నై, జనవరి 2, (ప్రజాపాలన) :** ఇక నా జీవితం ప్రజలకే అంకితం.. సరిగ్గా ఈ మాటలని రెండు నెలలు కాలేదు. అప్పుడే తలైవా రజనీకాంత్ అనారోగ్యం కారణంగా ప్రజాజీవితంలోకి అడుగుపెట్టలేనని చెప్పడం దేశవ్యాప్తంగా షాక్ కలిగించింది. కుటుంబం ఒత్తిళ్లో, షూటింగ్‌లో 50 మంది సమక్షంలోనే కరోనా కొందరికి సోకిన నేపథ్యం కలిగించిన మనస్తాపం వల్లో కానీ రజనీ రాజకీయాలు వద్దనుకున్నారు. రాజకీయ పార్టీలు తన నిర్ణయంపై వ్యతిరేకంగా స్పందించలేదు. పైగా ఆయన మద్దతు మాకుంటే చాలు అంటూ తమిళనాడులో కమల్ హసన్ నుంచి కమలం పార్టీ దాకా కోరుకుంటున్నాయి. రజనీనీ కలవడానికి పోటీలు పడుతున్నాయి. తమిళనాడులోని పలు పార్టీలు ఇప్పుడు సూపర్ స్టార్ రజనీకాంత్ వెంటపడుతున్నాయి. ఆయన్ను ప్రసన్నం చేసుకునేందుకు పోటీ పడుతున్నాయి.రాజకీయాలు వద్దన్నావు సరే... ఎన్నికలకు వెళ్లనన్నావు సరే... మీరు వద్దనుకున్నా మీలోని చరిష్మా మాకివ్వు.. మా పార్టీ గెలుపునకు మద్దతుగా నిలువు. కార్యకర్తల్లో నూతన ఉత్తేజం నింపు.. అంటూ ఇప్పుడు పెద్దా చిన్నా రాజకీయ పార్టీలన్నీ రజనీ నామస్మరణ చేస్తున్నాయి.రజనీ నిర్ణయం ఒకటి, రెండు పార్టీలకు మినహా అనేకపార్టీలకు ఆనందం కలిగించింది. రాష్ట్రంలో రజనీ ఫాలోయింగ్‌ను ఓటింగ్‌గా మలుచుకోవాలనే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. రజనీ కరుణాకటాక్ష వీక్షణాల కోసం పలు పార్టీలు ఆయన ఇంటి ముందు క్యూకట్టేలా ఉన్నాయి. ఇందులో అందరికంటే ముందు నిలిచింది మక్కల్ నీది మయ్యం అధ్యక్షులు, నటుడు కమల్‌హాసన్. రాజకీయ పార్టీ పెట్టడం లేదని రజనీ ప్రకటించగానే మిత్రుని మద్దతు కోరుతానని కమల్ మొట్టమొదటగా ప్రకటించారు. అయితే ఆధ్యాత్మికతతో కూడిన రజనీ రాబోయే ఎన్నికల్లో తమకు అండగా నిలుస్తారని అన్నాడీఎంకే సైతం తన మనసులోని మాటను బయట పెట్టింది.



ఇక ప్రధాని నరేంద్ర మోదీకి రజనీకాంత్ మిత్రుడు. ఈ మిత్రత్వాన్ని అవకాశంగా తీసుకుని మద్దతు కోరేందుకు కమలనాథులు సిద్ధంగా ఉన్నారు. బీజేపీ ఇప్పటికే ఆ ప్రయత్నాలను ప్రారంభించినట్లు సమాచారం. ఇక 1996 ఎన్నికల్లో డీఎంకేకు మద్దతు ఇవ్వడం ద్వారా డీఎంకే విజయానికి రజనీకాంత్ దోహదపడ్డారు. అప్పటి నుంచి డీఎంకే అధ్యక్షులు స్టాలిన్, రజనీ మధ్య మైత్రి బంధం ఏర్పడింది. అయితే ఈ ఎన్నికల్లో సైతండీఎంకే తన వంతు ప్రయత్నాలు చేయడం అనుమానమే. ఆనాడు జయపై వ్యతిరేకతతోనే రజనీ అలా వ్యవ హరించారేగానీ డీఎంకే గెలుపుపై ఆసక్తితో కాదు. కాగా రజనీతో కలిసి పనిచేసేందుకు ఆశపడుతున్నానని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీమంత్రి పీ చిదంబరం ఇటీవలే ట్వీట్ చేసి పరోక్షంగా మద్దతు కోరారు. రజనీ కోసం ఎవరి ప్రయత్నాలు వారు మొదలుపెట్టారు. మరి రజనీ ఎవరివైపైనా మొగ్గుచూపుతారా లేక మౌనంగా ఉండిపోతారా అనే ప్రశ్నకు సమాధానం కోసం ఎన్నికల వరకు వేచిచూడక తప్పదు.

# పరిహారం లేకుండానే స్వాధీనానికి కసరత్తు

**విశాఖపట్టణం, జనవరి 2, (ప్రజా పాలన) :** వైజాగ్-చెన్నై పారిశ్రామిక కారిడార్ (విసిఐసి)లో భూములు, ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులకు పరిహారం పూర్తి స్థాయిలో చెల్లించకుండానే భూములు స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వం చూస్తోంది. భూములు, ఇళ్లు, పొలాల్లోని చెట్లు, బావులు, ఇంటి ఆవరణలోని ఖాళీ స్థలాలకు పరిహారం ఇష్టానుసారం చెల్లించింది. జిరాయితీ భూముల్లోని చెట్లకు నామమాత్రపు పరిహారం చెల్లించినా, డి?పట్టా భూముల్లోని చెట్లకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. విశాఖ జిల్లా నక్కపల్లి మండలం బుచ్చిరాజుపేట, డిఎల్.పురం, వేంపాడు, చందనాడ, రాజయ్యపేట రెవెన్యూ గ్రామాల్లో పరిశ్రమల కోసం 3,899 ఎకరాల భూమిని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఎపిఐఐసి) సేకరించింది. ఇక్కడ వివిధ రకాల పరిశ్రమల ఏర్పాటుకు గత నెల 25న కాలుష్య నియంత్రణ మండలి ప్రజాభిప్రాయ సేకరణను హడావిడిగా నిర్వహించింది.

ప్రభుత్వంభూములు, ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులకు పరిహారం చెల్లింపుపై శ్రద్ధ చూపకపోవడంతో న్యాయం చేయాలంటూ రెవెన్యూ, ఎపిఐఐసి కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా నిర్వాసితులు తిరుగుతున్నారు. చందనాడ రెవెన్యూ గ్రామ పరిధిలోని పాటిమీద గ్రామానికి ఆనుకొని సబ్‌స్టేషన్ నిర్మాణానికి సేకరించిన భూమి, ఇళ్లకు పరిహారం సరిగా ఇవ్వలేదని ఆ గ్రామస్తులు తెలిపారు. ప్రభుత్వం ఇళ్లకు చెల్లిస్తున్న పరిహారం వేరే చోట ఇంటి స్థలం కొనడానికి కూడా సరిపోయేలా లేదు. రావి నూకరాజు ఐదేళ్ల క్రితం ఐదు సెంట్లలో రూ.12 లక్షల వ్యయంతో రెండు డాబా ఇళ్లు కట్టుకున్నాడు. అధికారులు ఈ ఇంటి విలువ రూ.3.50 లక్షలు కట్టారు. తన ఇంటి నిర్మాణ ఖర్చు కంటే తక్కువ విలువ కట్టడంతో పరిహారం తీసుకోలేదని నూకరాజు తెలిపాడు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రావి భూలేక, రావి కృష్ణవేణి పక్కపక్కన ఇళ్లు కట్టుకున్నారు. ప్రభుత్వం ఇచ్చిన డబ్బులు చాలకపోవడంతో అప్పు చేసి ఇళ్లు నిర్మించుకున్నారు. ఈ రెండిళ్లకూ పరిహారం ఇవ్వకుండా కృష్ణవేణి మామగారైన చినబ్బాయి పేరున రూ.5 లక్షల పరిహారం చెల్లించారు. ఈ రెండిళ్ల చుట్టూ ఉన్న ఖాళీ స్థలం పది సెంట్లకు కూడా పరిహారం చెల్లించలేదని కృష్ణవేణి మరిది గోవింద్ వాపోయాడు.

ఒకే ఆవరణలో వేర్వేరుగా ఇళ్లుండి, వారి పేరున రేషన్ కార్డులు ఉండి ఇంటి పన్ను ఏటా చెల్లిస్తున్నప్పటికీ పరిహారం మాత్రం కొడుకులకు చెల్లించకుండా ఒకే ఇంటి కింద చూపి తండ్రి పేర పరిహారం చెల్లించడంతో నిర్వాసి తులకు తీవ్ర నష్టం జరుగుతోంది. రావి మాణిక్యం, సూరిశెట్టి లక్ష్మి పేర గతంలో ప్రభుత్వం డి పట్టా ఇచ్చింది. ఈ భూమిలో జీడి మొక్కలు వేసుకోవడంతో ఏటా ఎకరాకు రూ.30 వేలు ఆదాయం వచ్చేది. జీడి మొక్కలు పెంచుకోవడానికి బావి కూడా తవ్వారు. డి?పట్టా భూమికి పరిహారం చెల్లించి, అందులోని జీడి మొక్కలకు పరిహారం చెల్లించలేదు. కొబ్బరి, మామిడి చెట్లు కాయడంలేదని వాటికి తక్కువ విలువ కట్టారు. కొన్ని దశాబ్దాల నుంచి పేదలు సాగు చేసుకుంటున్న నాలుగున్నర ఎకరాల పల్లపు భూమికి పరిహారం చెల్లించలేదు. నిర్వాసితులకు అన్యాయం జరగకుండా చూస్తామని అధికారులు చెప్పడం తప్ప, వాస్తవ విలువ ప్రకారం పరిహారం ఇవ్వడం లేదు.

# చిరు-చెర్రీ స్టెప్పులు.. 'ఆచార్య'లో దుమ్ములేవడం ఖాయం

చిరంజీవిని మెగాస్టార్ గా టాలీవుడ్ శిఖరాగ్ర సింహాసనం మీద కూర్చోబెట్టడంలో రెండు అంశాలు ఆయనకు గొడుగు పట్టాయి. నవరస నటనా వైవిధ్యం ఒకటైతే.. అనితర సాధ్యమైన నాట్యం మరో ఎత్తు. మెగాస్టార్ స్టెప్పేస్తే.. చిందేయని అభిమాని ఉండడంటే అతిశయోక్తి కాదు. అందుకే.. ఆయన సినిమాల్లో మిగతా అంశాలకు ఎంత ప్రాధాన్య ఉంటుందో.. డ్యాన్స్ కు అంతకన్నా ఎక్కువ ఇంపార్టెన్స్ ఉంటుంది. రాబోతున్న చిత్రం 'ఆచార్య'లోనూ డ్యాన్సులు దద్దరిల్లిపోయేలా ఉన్నాయి. లేటెస్ట్ బజ్ ప్రకారం.. మెగాస్టార్ చిరంజీవితో మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ ఓ సాంగ్ లో స్టెప్పులు వేయనున్నట్టు తెలుస్తోంది.



ఈ మెగా తండ్రీకొడుకులపై డైరెక్టర్ కొరటాల శివ.. రాకింగ్ డాన్స్ ప్లాన్ చేసినట్లు టాక్. మ్యూజిక్ డైరెక్టర్ మణిశర్మ బీట్ కు వీరిద్దరూ అద్దిరిపోయే స్టెప్పులేయనున్నట్టు తెలుస్తోంది. కాగా.. ఆచార్య సినిమాలో చిరంజీవి సోలో సీన్స్ షూట్ చేయడం జనవరి 10తో ముగుస్తుంది. సంక్రాంతి పండుగ నేపథ్యంలో షూట్ కు సెలవు ప్రకటించి.. ఫెస్టివల్ తర్వాత తిరిగి షూటింగ్ ప్రారంభించనున్నారు. ఇక కోవిడ్-19 కారణంగా సెల్ఫ్ ఐసోలేషన్ లో ఉన్న రామ్ చరణ్.. ఫెస్టివల్ తర్వాతి షెడ్యూల్లో జాయిన్ అవుతారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో చిరు-చెర్రీ స్పెషల్ సాంగ్ ను ఫిబ్రవరిలో షూట్ చేయనున్నట్టు తెలుస్తోంది.

ఈ సినిమా కోసం రామ్ చరణ్ 30 రోజులు కేటాయించారు. రామ్ చరణ్ నిరంజన్ రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం లో.. మెగాస్టార్ సరసన కాజల్ అగర్వాల్ నటిస్తోంది. అయితే.. చరణ్ సరసన నటించబోయే హీరోయిన్ ఎవరనేది ఇంకా ఖరారు కాలేదు. ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ చిత్రం కోసం ఫ్యాన్స్ ఈగర్ గా వెయిట్ చేస్తున్నారు.

# పెద్ద స్టార్ అవ్వాలని ఉంది.. డాడీ నేర్పించట్లేదు..



టాలీవుడ్ ప్రిన్స్ మహేష్ బాబు కూతురిగా అందరికీ తెలిసిన 'సితార'.. క్రమంగా సింగిల్ గానే ఫేమస్ అవుతోంది. తరచూ పలు ఈవెంట్లలో పాల్గొంటూ.. సోషల్ మీడియా లో తన వీడియోలు పోస్ట్ చేస్తూ.. అందరికీ నోటెడ్ అవుతోంది సితార. లేటెస్ట్ గా న్యూ ఇయర్ రోజున ఓ మీడియా ఛానెల్ తో మాట్లాడింది. తన ప్రస్తుత లైఫ్ తోపాటు ఫ్యూచర్ డ్రీమ్స్ కూడా షేర్ చేసుకుంది ఈ స్టార్ డాటర్. ఆ వివరాలు ఆమె మాటల్లోనే...

**నాకు దొరికిన వరం..**

మా డాడీ మహేష్ బాబు.. మమ్మీ నమ్రత.. సోదరుడు గౌతమ్ తో కూడిన కుటుంబంలో నేను ఉన్నందుకు గొప్ప అదృష్టంగా భావిస్తాను. నాకు ఇంత గుర్తింపు వచ్చిందంటే మా ఫ్యామిలీ వల్లే. ఈ ఫ్యామిలీని ఇచ్చినందుకు నేను దేవుడికి థ్యాంక్స్ చెప్తా. నాకు నాన్న అంటే చాలా ఇష్టం. నాన్న ఇంట్లో ఉంటే ఆయనతోనే ఉంటాను. షూటింగు వెళ్తే మాత్రం అమ్మతో ఉంటా.

**నేను ఆ హీరో అభిమానినే..**

మా నాన్నే నా ఫేవరెట్ హీరో. ఆయన సినిమాలు మాత్రమే ఎక్కువగా చూస్తాను. మిగిలిన సినిమాలు పెద్దగా చూడను. వేరే హీరోల గురించి పెద్దగా తెలియదు. ఫ్యూచర్ లో నేను కూడా పెద్ద స్టార్ అవ్వాలనుకుంటున్నాను. కానీ.. నాన్నను యాక్టింగ్ గురించి అడిగితే చెప్పరు. నాకు యాక్టింగ్ నేర్పించమంటే నేర్పించరు.

**గౌతమ్తో కలిసి..**

నా సోదరుడు గౌతమ్తో కలిసి కూడా నటించాలని ఉంది. కానీ.. ఆ కోరిక ఎప్పుడూ తీరుతుందో తెలియదు. ఆ ఛాన్స్ కోసం నేను ఎదురు చూస్తున్నాను. మా తమ్ముడు మాత్రం ఆ ఛాన్స్ ఇప్పటికే కొట్టేశాడు. నాన్నతో కలిసి గౌతమ్న నటించాడు. నాకు కూడా నాన్నతో కలిసి నటించాలని ఉంది.

**నచ్చిన హీరోయిన్ ఆమె..**

నాకు హీరోయిన్ రష్మిక మందన్న అంటే చాలా ఇష్టం. ఆమె నాతో ఫన్నీగా చాలా క్లోజ్ గా ఉంటుంది. ఆమెతో టైమ్ చాలా గడిచిపోతుంది. నాతో చాలా చక్కగా మాట్లాడుతుంది. అందుకే ఆమె అంటే ఇష్టం ఏర్పడింది.

# సొంత ఛార్టెడ్ ఫ్లైట్లు ఉన్న టాలీవుడ్ హీరోలు వీరే


సినిమాల్లో తరచూ కనిపించే సీన్ ఇప్పుడు రియల్టీలోకి వచ్చేసింది. ఒక బడా పారిశ్రామికవేత్త.. అతడి రేంజ్ చూపించాలంటే.. తన సొంత విమానంలో వెళుతుంటాడు. ఇలాంటి సీన్లు రీల్ లో చాలానే చూసి ఉంటాం. కానీ..రియల్ లైఫ్లో సొంత ఛార్టెడ్ విమానాలు ఉండే వారిని వేళ్ల మీద లెక్కబెట్టుకోవచ్చు. మిగిలిన రంగాల సంగతి ఎలా ఉన్నా.. టాలీవుడ్ హీరోల్లో పలువురికి తమదైన సొంత విమానాలు ఉండటం విశేషంగా చెప్పాలి. ఇటీవల జరిగిన నాగబాబు కుమార్తె నిహారిక వివాహం రాజస్థాన్ లోని ఉదయపూర్ ప్యాలెస్ లో జరగటం తెలిసిందే. దీని కోసం తమ సొంత విమానాల్లో కుటుంబ సభ్యులతో సహా వెళ్లటంతో.. టాలీవుడ్ హీరోల రేంజ్ కొత్త చర్చకు తెర తీసింది. టాలీవుడ్ హీరోల్లో సొంత విమానాలు ఉన్న వారి జాబితా కాస్త పెద్దదిగానే చెప్పాలి. సీనియర్ నటుల విషయానికి వస్తే.. హీరో నాగార్జునకు సొంత విమానం ఉందంటున్నారు. కుటుంబ సభ్యులతో ఎక్కడికైనా వెళ్లటానికి దీన్ని వాడుతుంటారు. తాజాగా తన వైల్డ్ డాగ్ షూటింగ్ కోసం దీన్ని వాడారు. దీనికి కారణం.. సినిమా షూటింగ్ మధ్యలో బిగ్ బాస్ షూటింగ్ కోసం హైదరాబాద్ రావాల్సి వచ్చింది. దీంతో.. ఆయన తన సొంత విమానాన్ని వాడారు. నిహారిక పెళ్లి సందర్భంగా మెగా ఫ్యామిలీలోని హీరోలకు సొంత విమానాలు ఉన్న విషయం బయటకు వచ్చింది. అల్లు అర్జున్ తన సొంత విమానం లోనే ఆ పెళ్లికి వెళ్లారు. చిరు ఫ్యామిలీకి సొంత ఫ్లైట్ ఉంది. దాదాపు రూ.100 కోట్ల వ్యయంతో దీన్ని కొనుగోలు చేశారని చెబుతారు. నిహారిక పెళ్లికి తమ సొంత విమానంలోనే వారు



వెళ్లారు. జూనియర్ ఎన్టీఆర్ కు సొంత విమానం ఉంది. ఈ మధ్యనే రూ.80 కోట్లు ఖర్చు చేసి కొనుగోలు చేసినట్లుగా చెబుతున్నారు. మరి.. సొంత విమానాలు ఉన్న హీరోలు వాటిని ఎక్కడ ఉంచుతారు? అన్న ప్రశ్నకు సమాధానం ఇట్టే వచ్చేస్తుంది. తమకు సమీపంలో ఉన్న ఎయిర్ పోర్టులో వాటిని ఉంచి.. నిర్వహణ ఒప్పందాలు ఆయా ఎయిర్ పోర్టులోని కంపెనీలతో చేసుకుంటాయి. అంతేకాదు.. తమకు అవసరంలేని సందర్భాల్లో ఛార్టెడ్ విమానాల్ని అద్దెకు కూడా ఇస్తున్నారట. మొత్తానికి టాలీవుడ్ హీరోలు మా జోరుతో ఉన్నట్లు అనిపించట్లేదు?

# ఎన్టీఆర్ ఫ్యాన్స్‌కి గుడ్ న్యూస్.. త్వరలో త్రివిక్రమ్ మూవీ స్టార్ట్!!

టాలీవుడ్ స్టార్ హీరో ఎన్టీఆర్ అలాగే స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ కాంబినేషన్లో రాబోయే రెండో సినిమా కోసం నందమూరి అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. 'అరవింద సమేత' సినిమా తర్వాత వీరిద్దరూ కలిసి మరో సినిమా చేయనున్న సంగతి తెలిసిందే. హారిక అండ్ హాసిని బ్యానర్తో పాటు ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మించబోతోన్న ఈ సినిమా షూటింగ్ త్వరలో ప్రారంభం కానుందట. ఎన్టీఆర్ ప్రస్తుతం దర్శక ధీరుడు రాజమౌళి తెరకేక్కిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం ఆర్ఆర్ఆర్ కొమరం భీమ్ పాత్రలో నటిస్తున్నాడు. ఆ సినిమా షూటింగ్ పూర్తైయిన తర్వాత బ్రేకులు లేకుండా త్రివిక్రమ్ సినిమా చేయనున్నాడు ఎన్టీఆర్. ప్రస్తుతం ఈ సినిమాకు 'అయినను పోయిరావలె హస్తినకు' అనే టైటిల్ ప్రచారంలో ఉంది. రాజకీయ నేపథ్యంలో ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న పరిస్థితుల పై త్రివిక్రమ్ ఈ సినిమాను తెరకెక్కించబోతున్నట్టు సమాచారం. పర్ఫెక్ట్ ఫ్యామిలీ పొలిటికల్ ఎంటర్టైనర్గా ఈ చిత్రం




రానుందని టాక్. ఇక తాజాగా న్యూ ఇయర్ సందర్భంగా కలిసిన ఎన్టీఆర్ త్రివిక్రమ్ తమ సినిమా గురించి క్లారిటీ ఇచ్చాడు. త్వరలో షూటింగ్ ప్రారంభం చేస్తామని తెలిపారు. కానీ ఎప్పుడు మొదలు అవుతుంది అనేది మాత్రం త్వరలో చెప్తామని అన్నట్లు తెలుస్తుంది. ఎన్టీఆర్ కెరీర్ లో 30వ సినిమాగా రూపొందనున్న ఈ అయినను పోయిరావలే హస్తినకు సినిమా త్వరలో మొదలు పెడతామని హారిక అండ్ హాసిని క్రియేషన్స్ వారు ట్విట్టర్ వేదికగా కన్ఫర్మ్ చేసారు. ఈ ప్రకటనతో ఎన్టీఆర్ అభిమానులలో ఉత్సాహం నెలకొంది. ఇప్పటికే త్రివిక్రమ్ ఎన్టీఆర్ కాంబినేషన్ లో వచ్చిన అరవింద సమేత మూవీ ఎంతటి విజయం సాధించిందో అందరికి విదితమే. ఇక ఈ సినిమా కూడా అలాంటి విజయాన్ని అందుకుంటుందని సోషల్ మీడియాలో ఫ్యాన్స్ హడావిడి చేస్తున్నారు. ఇక ఎన్టీఆర్ సరసన హీరోయిన్ గా కన్నడ బ్యూటీ రష్మికను పరిశీలిస్తున్నట్లు సమాచారం.

## మళ్లీ ఝుమ్మంటుంది.. తాప్సీ ఈజ్ బ్యాక్

'తాప్సీ పన్నూ..' 2010లో 'ఝుమ్మంది నాదం' అంటూ తెలుగు తెరపై ఎంట్రీ ఇచ్చిన ఈ సుందరి.. యూత్ గుండెల్లో కోటి వీణలు మోగించింది. అరుదైన దర్శకేంద్రుడి పండ్లతో కొట్టించుకొని.. కుర్ర ఆడియన్స్ తో 'అబ్బా' అనిపించింది. ఆ తర్వాత మూడ్నాలుగు సినిమాల్లో కనిపించిన ఈ బ్యూటీ.. ఫ్యాన్స్ హృదయవీణ తీగలు తెంపేసి బాలీవుడ్ చెక్కేసింది. ఇన్నాళ్లకు వెనక్కి వచ్చేస్తుండడంతో తెగిన తంత్రులు.. మళ్లీ శ్రావ్యంగా మోగబోతున్నాయి. బాలీవుడ్ కు వెళ్లిన తాప్సీ.. అక్కడ తన సామర్థ్యాన్ని నిరూపించుకుంది. కథా ప్రాధాన్యమున్న పాత్రలను సెలక్ట్ చేసుకుంటూ సక్సెస్ సాధిస్తూ ముందుకు దూసుకెళ్లింది. ప్రస్తుతం.. బాలీవుడ్ లో రెండు బయోపిక్ లలో నటిస్తోంది తాప్సీ పన్నూ. స్పోర్ట్స్ డ్రామాలు తెరకెక్కుతున్న ఈ చిత్రాలతో ఫుల్ బిజీగా ఉంది ఈ బ్యూటీ. కాగా.. టాలీవుడ్ కి తిరిగి రావడానికి ప్లాన్ చేస్తోంది. దర్శకుడు 'తేజ' నెక్స్ట్ మూవీ 'అలివేలు వెంకటరమణ' చిత్రంలో నటించడానికి సైన్ చేసింది. ఈ రొమాంటిక్ మూవీ త్వరలోసెట్స్ పైకి వెళ్తుందని సమాచారం. అయితే.. ఈ చిత్రంలో హీరోగా ముందు గోపిచంద్ ను అనుకున్నాడట దర్శకుడు తేజ. అయితే.. అందుతున్న అప్డేట్స్ ప్రకారం గోపీచంద్ ఈ ప్రాజెక్టులో భాగం కాలేదని తెలుస్తోంది. ఇక హీరోయిన్ పాత్ర కోసం కాజల్ అగర్వాల్ తదితరుల పేర్లు పరిశీలించినప్పటికీ.. ఫైనల్ గా తాప్సీని ఖరారు చేశాడట డైరెక్టర్. ఈ సినిమా కథ కూడా ఆమెకు వినిపించాడని సాటిస్ఫై అయిన తాప్సీ ఓకే చెప్పేసిందని టాక్. కాగా.. ప్రధాన నటుడి పాత్రకు ఒక యువ తమిళ నటుడి ని తేజా ఫైనల్ చేసినట్టు తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్ స్క్రిప్ట్ వర్క్ ఇటీవలే పూర్తయింది. ఈ 'అలివేలు వెంకటరమణ' చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించబోతోంది. త్వరలోనే షూట్ స్టార్ట్ చేసి ఈ సంవత్సరంలోనే సినిమాను విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నాడట డైరెక్టర్.



# బతుకు చీకటి వెలుగుల దోబూచులాట.. నీకు నువ్వే లాంతరు!



బుల్లితెర యాంకర్ కం నటి షామా శికందర్ అడ్డూ ఆపూ లేని ఫోటో షూట్లపై వివరణలు అవసరం లేదు. ఈ అమ్మడు గత కొంత కాలంగా వరుస ఫోటోషూట్లతో దుమారం రేపుతున్న సంగతి తెలిసి నదే. ఇంతకుముందు మాల్దీవుల నుంచి వేడెక్కించే బికినీ బీచ్ ఫోటోలతో విరుచుకు పడిన షామా లేటెస్టుగా ఇండోర్ ఫోటోషూట్ తోనూ అగ్గి రాజేస్తోంది. ఇటీవలే బికినీ బీచ్లో న్యూఇయర్ సెలబ్రే షన్ తోనూ తనదైన శైలిలో హీట్ పెంచింది. తాజాగా కిచెన్ ఫోటో షూట్ మైమరిపిస్తోంది. హాలీవుడ్ స్టార్లు పాప్ స్టార్లకే మతి చెడేలా షామా ఇచ్చిన ఫోజు అగ్గి మీద గుగ్గిలంలా మారింది. అసలు హద్దులు చెరిపేసేలా గ్లామర్ షోకి తనకు ఎలాంటి అభ్యంతరం లేదని ఈ అమ్మడు ఫీలర్స్ వదులుతోంది. థై సొగసుల ఎలివేషన్ లో తనని కొట్టేవాళ్లే లేరని ఫీలవుతోంది. షామాకు హిందీ బుల్లితెరతో పాటు వెండితెర అవకాశాలు ఇటీవల వెల్లువెత్తుతున్నాయని సమాచారం. ఇంతగా శ్రమిస్తున్నందుకైనా సౌత్ పిలిచి అవకాశం ఇస్తుందేమో చూడాలి. ఇటీవల నెమ్మదిగా షూటింగులు ఊపందుకుంటు న్నాయి. దాదాపు 100 సినిమాలు చిత్రీకరణల్లో ఉన్నాయి. వీటిలో ఎక్కడైనా ఐటెమ్ నంబర్ కి అయినా అవకాశం లేకపోతుందంటారా? జీవితం చీకటి వెలుగుల దోబూచులాట. నీకు నువ్వే లాంతరు! అంటూ అమ్మడు అద్భుతమైన కవితల్ని అల్లుతోంది.

Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed at Unyted Publications from H.no.# 5+-61-3,Rajendra Nagar,Seethampeta,Visakhapatnam-16,Published at H.No. 5+-61-3,Rajendra Nagar,Seetham peta, Visakha patnam-16, Andhrapradesh,India. Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com